

ఆ నీళ్లను మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే : అమిత్ షా 06


www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

ఆదివారం | 22.06.2025 | సంపుటి : 2 | సంచిక :141 | పేజీలు : 8 | వెల : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ప్రపంచానికే స్వస్థత కేంద్రంగా భారత్

### ఆధునిక పరిశోధనలతో యోగాను పరిపుష్టం చేస్తున్నాం



- వైద్యం కోసం మన దేశం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు
- స్థూలకాయం ప్రపంచానికి అతి పెద్ద సవాలు.. దాన్ని అధిగమించాలి
- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ
- కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించారని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు
- మంత్రి లోకేశ్‌పై ప్రధాని ప్రత్యేక ప్రశంసలు

02



భారత్‌కు వెళ్లి స్వస్థత చేకూర్చుకో అన్న భావన ఇప్పుడు ప్రపంచంలో విస్తృత ప్రాచుర్యం పొందుతోందని, అనారోగ్యంతో ఉన్నవారికి స్వస్థత చేకూర్చే అతిపెద్ద కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ పరిణామంలో యోగా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్వస్థత కోసం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు జారీచేస్తామని ఆయన ప్రకటించారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలమందితో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని ప్రసంగించారు.



## కొనసాగుతున్న రైతుభరోసా

# నిధుల జమ

### 9 ఎకరాల వరకు విడుదల

- ఓఆర్ఆర్ లోపల 1.20 లక్షల మందికి సాయం
- రియల్‌ఎస్టేట్‌లోని 93 వేల ఎకరాలకు బంద్
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జూన్ 21 : రాష్ట్రంలో కోసం రైతు భరోసా పథకం కింద 9 ఎకరాల వరకు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం నాటికి ఎడెకరాల వరకు నిధులను విడుదల చేసిన ప్రభుత్వం శనివారం 8,9 ఎకరాలు ఉన్న రైతులకు సాయం జమ చేసింది. ఎనిమిది ఎకరాలు ఉన్న 67, 352 మంది రైతులకు సంబంధించిన 4.42 లక్షల ఎకరాలకు రూ.265.91 కోట్లను విడుదల చేసింది. అలాగే 9 ఎకరాలున్న 39,164 మంది రైతులకు చెందిన 3,23,875 ఎకరాలకు రూ.194కోట్లకు పైగా నిధులు జమ అయ్యాయి. ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లను జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మిగతా 2 లో



## ఎడ్‌సెట్‌లో అమ్మాయిలదే పైచేయి

- ఉత్తీర్ణులైన వారిలో 81.50 శాతం వారే
- తొలి 10 ర్యాంకర్లలో మాత్రం ముగ్గురే

02

## కౌశిక్‌రెడ్డి అరెస్టు..

### రిమాండ్‌కు కోర్టు తిరస్కరణ

- క్వారీ యజమానిని బెదిరించిన కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రోజంతా నాటకీయ పరిణామాలు



హైదరాబాద్, జూన్ 21 : గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హనుమకొండలోని సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యే దుబాయ్ వెళ్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం తెల్లవారు జామున శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. గత ఏప్రిల్ 21న హనుమకొండలోని ఎన్‌జీవోఎస కాలనీకి చెందిన గ్రానైట్ వ్యాపారి కట్ట మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టారు. తన భర్తను కౌశిక్‌రెడ్డి రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించారని, ఎమ్మెల్యేతో తన కుటుంబానికి ప్రాణభయం ఉందని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై బీఎన్ఎస సెక్షన్లు 308(2), 308 (4), 352 కింద కేసు నమోదు చేశారు. మిగతా 2 లో



## దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతమైంది

- నాడు అన్ని కంపెనీలను సులువుగా అనుమతులు
- దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు.

03

## అందరి జీవితంలో యోగాను భాగం చేస్తాం

- మరో 264 మంది శిక్షకుల నియామకానికి చర్యలు : మంత్రి రాజనర్సింహా
- గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా యోగా దినోత్సవం



02

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనికి యోగానే పరిష్కారమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



విద్యుత్ శాఖ ఉద్యోగులకు

## 2% వరకు డీఏ పెంపు

- జనవరి ఒకటి నుంచి అమల్లోకి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02

## పేదలందరికీ ఇళ్లు కట్టించాకే

# ఓట్లడుగుతాం

- బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనివి 10 నెలల్లో చేసి చూపాం
- రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించండి
- భూ సమస్యలపై 8.58 లక్షల దరఖాస్తులు: పొంగులేటి



**హైదరాబాద్, జూన్ 21 :** రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించాకే తాము ఓట్లడుగుతామని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మిగతా 2 లో

## 'ఓటర్ల గోప్యతకు భంగం'

### 'మహా' పోలింగ్ సీసీ ఫుటేజీల డిమాండ్‌పై ఈసీ

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలు బహిర్గతం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. అలా చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ చర్య ఓటర్ల గోపత్యకు భంగం కలిగించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. గతేడాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.




06



## జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



# ప్రపంచానికే స్వస్థత కేంద్రంగా భారత్

**విశాఖపట్నం :** భారత్‌కు వెళ్లి స్వస్థత చేకూర్చుకో అన్న భావన ఇప్పుడు ప్రపంచంలో విస్తృత ప్రాచుర్యం పొందుతోందని, అనారోగ్యంతో ఉన్నవారికి స్వస్థత చేకూర్చే అతిపెద్ద కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ పరిణామంలో యోగా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్వస్థత కోసం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు జారీచేస్తామని ఆయన ప్రకటించారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలమందితో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని ప్రసంగించారు. ఇందులో పాల్గొనే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తంచేశారు. విశాఖను అభివృద్ధి, రమణీయ ప్రకృతి సౌందర్యాల మేలు కలయికగా ఆయన అభివర్ణించారు. యోగా దినోత్సవాన్ని అత్యంత విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించిందని కొనియాడారు. రాష్ట్రంలో రెండు కోట్లకుపైగా ప్రజలు పాల్గొనడం... వారిలో ఉరకలెత్తే ఉత్సాహానికి నిదర్శనమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఇలాంటి స్ఫూర్తే బలమైన పునాదిగా ఆయన పేర్కొన్నారు. కల్లోల పరిస్థితుల్లో శాంతిమార్గం యోగా"యోగాను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అది ఈ ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం దిశగా నడిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సమతుల్యం సాధించేందుకు యోగాతో దినచర్య ప్రారంభించాలి. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం అన్న నినాదం ప్రపంచ తీర్మానం కావాలి" అని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న అశాంతి, అస్థిరతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కల్లోల పరిస్థితుల్లో యోగా శాంతికి మార్గం చూపిస్తుందన్నారు. "మానవ సమాజానికి యోగా ఒక 'పాజ్ బటన్'. ఒక్కసారి ఆగి ఊపిరి పీల్చుకునేందుకు, సంతులనం చేసుకునేందుకు, మళ్లీ మామూలు మనుషులయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అంతర్గత శాంతిని ప్రపంచవిధానంగా మార్చే... 'మానవాళి-2.0 కోసం యోగా' అన్న సంకల్పానికి ఈ యోగా దినోత్సవం నాందీ ప్రస్తావనగా నిలవాలి. యోగా అనేది వ్యక్తిగత అభ్యసనానికే పరిమితం కాకూడదు, అది ప్రపంచ భాగస్వామ్యానికి ఒక మాధ్యమంగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రపంచంలోని ప్రతి దేశం తమ పబ్లిక్ పాలసీల్లో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## అందరి జీవితంలో
# యోగాను భాగం చేస్తాం

- మరో 264 మంది శిక్షకుల నియామకానికి చర్యలు : మంత్రి రాజనర్సింహ
- గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా యోగా దినోత్సవం



**హైదరాబాద్:** ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనికి యోగానే పరిష్కారమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా విశాఖపట్నంలో ప్రధాని మోదీ ఇచ్చిన యోగా దినోత్సవ సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం అంతా కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ.. 'యోగాను అందరి జీవితంలో భాగం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయుష్ విభాగంలో 630 మంది యోగా గురువులను నియమించాం. మరో 264 మంది నియామకానికి ప్రక్రియ కొనసాగుతోంది. ఆరోగ్య ఉపకేంద్రా ల్లో రోజూ ఉదయం యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. ఏడాది కాలంలో కొత్తగా 5 లక్షల మందికి శిక్షణ ఇచ్చాం. నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పీజీ కోర్సులను అందుబాటు లోకి తీసుకురానున్నాం' అని మంత్రి తెలిపారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. 10 నిమిషాలు చేసిన యోగాతోనే ఎంతో అనుభూతి కలిగిందని, ఇకపై రోజూ చేస్తానని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియానికి విద్యార్థులు, ప్రజలు భారీగా తరలిరాగా అల్పాహారం పంపిణీ సమయంలో రూం నంబరు 41 వద్ద స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. పలువురు యువతులు కింద పడిపోయారు. గాంధీ మెడికల్ కళాశాల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని నజీమాపై అందరూ పడ టంతో స్పృహ కోల్పోయింది. పోలీసులు వెంటనే ఆమెను కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, షూటింగ్ రేంజ్ వాటర్ స్పోర్ట్స్ హుస్సేన్‌సాగర్, సైక్లింగ్ విలోడ్రం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, యూసు ఫ్‌గూడ ఇండోర్ స్టేడియాల్లోనూ యోగా దినోత్సవం నిర్వహిం చారు. కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొన్నారు. డీజీపీ కార్యాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో డీజీపీ డా.జితేందర్, పోలీసులు యోగా సాధన చేశారు.

## కొనసాగుతున్న రైతుభరోసా
# నిధుల జమ

(మొదటిపేజీ తరువాయి)

ఔటర్ రింగ్ రోడ్డు లోపల 2.13 లక్షల ఎకరాల భూములు ఉండగా.. అందులో 93,000 ఎకరాల వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగుకు అనువుకాని భూములను గుర్తించి వాటికి సాయం నిలిపివేశామని తెలిపారు. పంటలు పండుతున్న 1.20 లక్షల ఎకరాల భూమికి రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, రానున్న 2,3 రోజులలో రైతులకు భరోసా నిధులు వారి ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. సాగు చేసే భూములకే రైతు భరోసా అందించాలనే ఉద్దేశంతో ఓఆర్ఆర్ లోపల ఉన్న భూములకు పథకాన్ని వర్తింపచేయడానికి కొంత సమయం పట్టిందని, దానిని భారాస నాయకులు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. "ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా సద్వినియోగం చేయాలన్నది మా ఆలోచన, దీనికి అనుగుణంగా తాము ముందుకెళుంటే విపక్షాలు రాద్ధాంతం చేయడం దారుణం. గతంలో భారాస ప్రభుత్వం రైతుబంధు కోసం నిధులు ఎప్పుడు రూ.7,624 కోట్లు దాటలేదు. కాని మా ప్రభుత్వం కేవలం 6 రోజుల్లోనే 9 ఎకరాల వరకు రైతుభరోసా కోసం రూ.7,700 కోట్లు విడుదల చేసింది" అని తుమ్మల తెలిపారు.



# కౌశిక్‌రెడ్డి అరెస్టు..

(మొదటిపేజీ తరువాయి)

క్వారీ యజమానిని డబ్బులివ్వాలని బెదిరించారంటూ నమోదైన కేసులో హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని వరంగల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ తిరస్కరిస్తూ బెయిలు మంజూరు చేశారు. ఈ క్రమంలో రోజంతా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని సుబేదారి పోలీసులు శనివారం తెల్లవారుజామున 2 గంటలకు కౌశిక్‌రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. దుబాయ్‌కు వెళ్తుండగా పక్కా సమాచారంతో సుబేదారి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని తెల్లవారుజాము 4.30 గంటలకు హనుమకొండలోని ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ నర్సింహారావు సుదీర్ఘంగా విచారించారు. ఎంజీఎంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. హనుమకొండ అదాలత్‌లోని మూడో ఎంఎం కోర్టులో హాజరుపర్చాల్సి ఉండగా.. న్యాయమూర్తి లేకపోవడంతో ఇన్‌ఛార్జి జడ్జిగా ఉన్న కాజీపేట రైల్వే కోర్టు న్యాయమూర్తి నాగసుస్మిత ముందు సాయంత్రం హాజరుపర్చారు. నాలుగు గంటలపాటు ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఎమ్మెల్యేకు రిమాండ్ తిరస్కరిస్తూ రూ.25 వేల సొంతపూచికత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. అంతేమొత్తానికి మరో ఇద్దరు వ్యక్తుల పూచికత్తును ఈ నెల 25లోపు కోర్టుకు సమర్పించాలంటూ న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

### రెండు నెలల కిందటే కేసు నమోదు

హనుమకొండ సుబేదారికి చెందిన కట్ట మనోజ్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కమలాపూర్ మండలం వంగపల్లి, గుండేడు గ్రామాల శివారులో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. క్వారీ నిర్వహించాలంటే డబ్బులు ఇవ్వాలని తన భర్తను కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారని.. తొలుత రూ.25 లక్షలు ఇచ్చామని.. కొన్ని రోజుల తర్వాత రూ.50 లక్షలు డిమాండ్ చేశారని మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి ఏప్రిల్ 21న సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలోనే ఎమ్మెల్యేను అరెస్టు చేశారు.

### కాంగ్రెస్ నాయకుల బండారం బయటపెడతా..: కౌశిక్‌రెడ్డి

తనను జైలుకు పంపాలని చూసిన కాంగ్రెస్ నాయకుల బండారం బయటపెడతానని పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేసిన సమయంలో, కాజీపేటలో బెయిల్ లభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'ఎలాంటి నోటీసులివ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి చెబితే నన్ను పోలీసులు అరెస్టు చేశారు. గుండేడు గ్రామంలో అనుమతులు లేకుండా క్వారీ నిర్వహిస్తున్నారు. దీని యజమాని మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు బినామీ. అనుమతుల్లేకుండా చేస్తున్న మైనింగ్‌పై పోరాడుతూనే ఉంటాం. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. బెయిలబుల్ కేసు అయినా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను రిమాండ్ చేయాలని చూసింది. కానీ మా లీగల్‌సెల్ ప్రతిభతో బయటకు వచ్చా' అని చెప్పారు. కాజీపేటలో ఆయన వెంట మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు. అంతకుముందు కౌశిక్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ సుబేదారి ఠాణా వద్దకు భారాస నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి విభాగం నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది.


### సీఎంను ప్రశ్నిస్తుంటే జీర్ణించుకోలేకే..: కేటీఆర్, హరీశ్‌రావు

అంతకుముందు కౌశిక్‌రెడ్డి అరెస్టును భారాస నేతలు ఖండించారు. ఆయన అరెస్టు అప్రజాస్వామికమని, భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలు వేర్వేరు ప్రకటనల్లో, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విలేకరుల సమావేశంలో కౌశిక్‌రెడ్డి అరెస్టుపై స్పందించారు. 'కౌశిక్‌రెడ్డి ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా విమానాశ్రయంలో ఎమ్మెల్యేను అరెస్టు చేసిన తీరు ఆక్షేపణీయం' అని పేర్కొన్నారు.

# పేదలందరికీ ఇళ్లు కట్టించాకే ఓట్లడుగుతాం

(మొదటిపేజీ తరువాయి)

తొలుత జగ్గుతండా గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. తర్వాత గుండాలలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో, హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగానూ ఆయన మాట్లాడారు. పేదల కలలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేనివి తమ ప్రభుత్వం పది నెలల్లో చేసి చూపిందన్నారు. రెండో విడత ఇళ్ల మంజూరును త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. పోడు రైతులను అటవీ అధికారులు ఇబ్బందులు పెడితే సహించబోమన్నారు. రాబోయే రోజుల్లో జరిగే ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించాలని ప్రజలను కోరారు. దశాబ్దకాలంపాటు విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు చెప్పుకోవడానికి రెవెన్యూ సదస్సులు దోహదపడ్డాయని చెప్పారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు. మొత్తంగా మూడు



విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాది కొత్తగూడెంలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్లగొండ జిల్లాలో 42 వేల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 3.27 లక్షలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. సాదాబైనామా తప్ప మిగిలిన అన్ని సమస్యలకు సంబంధించి 60 శాతం దరఖాస్తులకు పరిష్కారం చూపినట్లు ఆయన చెప్పారు.

# విద్యుత్ శాఖ ఉద్యోగులకు 2% వరకు డీఏ పెంపు

- జనవరి ఒకటి నుంచి అమల్లోకి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** విద్యుత్ రంగంలో దేశానికి తెలంగాణ దిక్సూచిలా పని చేయాలని డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం 71,417 మంది ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రయోజనం చేకూరేలా దాదాపు 2% డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ పెంపు గత జనవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ఈ మేరకు శనివారం ప్రజాభవన్లో విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలకు డీఏ పెంపు ఉత్తర్వుల ప్రతిని ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టిజన్లకు కూడా డీఏ పెంపు వర్తిస్తుందన్నారు. ఇప్పటివరకు 14.074 శాతం ఉన్న డీఏను 16.018 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ పెంపుతో విద్యుత్ సంస్థలపై ప్రతి నెలా రూ.11.193 కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది మార్చిలో రోజూవారీ గరిష్ఠ విద్యుత్ డిమాండు 17,162 మెగావాట్లకు పెరిగింది. ఇది గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే 2 వేల మెగావాట్లు అదనం.



రాష్ట్రంలో 2029-30 నాటికి రోజూవారీ డిమాండు 26,299, 2034-35 నాటికి 33,773 మెగావాట్లకు చేరుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చింది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి, సరఫరాకు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. 2029-30 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నాం" అని భట్టి వెల్లడించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, విద్యుత్ ఇంజనీర్స్ సంఘాల నాయకులు రత్నాకర్, శివాజీ, సాయిబాబు, శ్రీధర్, బీసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏటా వెయ్యిమంది
# ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య

**ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ**

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సచివాలయంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది ఐఐటీల్లో సీట్లు పొందిన ఎస్సీ గురుకుల సొసైటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. నీట్, జేఈఈలో ప్రతిభ చూపిన మరో 100 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. అనంతరం ఆయన సంక్షేమ శాఖల్లో కొత్త నిర్ణయాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలోని 844 మంది దివ్యాంగుల స్వయం ఉపాధికి రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. గిరిజన విద్యార్థుల విదేశీవిద్య విద్యార్థుల సంఖ్యను ఏటా 100 నుంచి 500కు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మైనార్టీల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని, సంక్షేమ కార్పొరేషన్లకు నిధులు మంజూరుచేసి




సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యకోసం సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నామని, పోషకాహారం కోసం డైట్‌ఛార్జీలు పెంచామన్నారు.



# ఎడ్‌సెట్‌లో అమ్మాయిలదే పైచేయి

- ఉత్తీర్ణులైన వారిలో 81.50 శాతం వారే
- తొలి 10 ర్యాంకర్లలో మాత్రం ముగ్గురే

**హైదరాబాద్:** రాష్ట్రంలో బీఈడీ కోర్సంటే అమ్మాయిలకే ప్రత్యేకం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఎడ్‌సెట్‌లో మొత్తం 30,944 మంది ఉత్తీర్ణులు కాగా..వారిలో 25,220 మంది..అంటే 81.50 శాతం అమ్మాయిలే కావడం గమనార్హం. బీఈడీలో ప్రవేశానికి నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలను శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి ఇతర అధికారులు విడుదల చేశారు. ఎడ్‌సెట్‌కు 32,106 మంది హాజరుకాగా వారిలో 30,944 మంది(96.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ఈ పరీక్షకు 38,754 మంది దరఖాస్తు చేయగా..వారిలో అబ్బాయిలు కేవలం 7,217 మంది(18.62 శాతం) మాత్రమే ఉన్నారు. అయితే తొలి 10 ర్యాంకర్లలో ఏడుగురు అబ్బాయిలున్నారు. నాలుగు, అయిదు, ఎనిమిది ర్యాంకులను మాత్రం అమ్మాయిలు దక్కించుకున్నారు. ఫలితాల విడుదల సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఏడాది ఏడు ప్రభుత్వ, 201 ప్రైవేట్...మొత్తం 208 బీఈడీ కళాశాలల్లో కన్వీనర్, బి కేటగిరీ కలిపి 18,556 సీట్లున్నాయని చెప్పారు. వాటిలో కన్వీనర్ 9,144, బి కేటగిరీ 5276 చొప్పున..మొత్తం 14,420 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈసారి కూడా అంతే మొత్తంలో సీట్లుంటాయన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు కురిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఇతర అధికారులు కరుణాకర్‌రెడ్డి, ఉషారాణి పాల్గొన్నారు.



# ప్రియురాలి భర్తను తుపాకీతో కాల్చిన యువకుడు

**ఉత్తర్‌ప్రదేశ్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లా నాగ్లా హిమాచల్ గ్రామంలో లలిత అనే మహిళ తన ప్రియుడు నీరేశ్‌ను ఉసిగొల్పి భర్త రుషికుమార్ (30)ను హత్య చేయించింది. ట్రక్ డ్రైవరు అయిన రుషికి రెండేళ్ల క్రితమే లలితతో పెళ్లి జరిగింది. వృత్తిరీత్యా రుషి దిల్లీ, ముంబయి, కోల్‌కతా లాంటి సుదూర ప్రాంతాలకు చాలా రోజులపాటు వెళ్లిపోయేవాడు. ఆ సమయంలో రుషి బాబాయి కుమారుడైన నీరేశ్‌కు లలిత దగ్గరైంది. భర్తను దారి తప్పిస్తే తామిద్దరం కలిసి బతకొచ్చని నీరేశ్‌పై లలిత పలుమార్లు ఒత్తిడి తెచ్చింది. గత బుధవారం తెల్లవారుజామున వీరి బంధువుల పెళ్లి జరిగింది. మద్యం తాగేందుకు రుషిని పక్కకు పిలిచిన నీరేశ్ చొక్కా లోపల దాచుకొన్న తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. రుషి అక్కడికక్కడే చనిపోయాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని లలిత పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. లలిత వ్యవహారశైలిపై అనుమానం రావడంతో గట్టిగా విచారించగా, నేరం అంగీకరించినట్లు గ్రామీణ ఎస్పీ అమృత్‌జైన్ తెలిపారు.

# దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతమైంది

- నాడు అన్ని కంపెనీలను సులువుగా అనుమతులు
- దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 21 :** స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు.

### తెలంగాణ విజయాన్ని అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసాయుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెటప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశాము. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ–హబ్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. ఐటీ రంగ ఉద్యోగ కల్పనల్లో వరుసగా రెండు సంవత్సరాల పాటు బెంగళూరుని హైదరాబాద్ దాటింది అని కేటీఆర్ గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో మేము తెలంగాణ రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం.

### వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. ఒకవేళ 15 రోజుల్లో లోపు అనుమతులు రాకపోతే ఆ పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి అవకాశం లేదు అని కేటీఆర్ తెలిపారు. వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము. భారతదేశంలోని 65 శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే మేము వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాము. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు రూ. 75 వేల కోట్లు జమచేసిన రాష్ట్రం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. అందుకే 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హర్యానా దాటి 2022 నాటికి నంబర్ వన్‌కు చేరింది అని కేటీఆర్ తెలిపారు.

### సంకల్పం ఉన్న నాయకుడు కేసీఆర్

ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుంది అనడానికి తెలంగాణ విజయగాథనే నిదర్శనం. కోటి ఇండ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒకటి. 80 మీటర్ల సముద్ర మట్టం నుంచి 618 మీటర్లకు నీటిని తీసుకెళ్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో తెలంగాణ నెంబర్ వన్. పారిశ్రామిక అవసరాల కోసం తగినంత నీటిని అందుబాటులో ఉంచిన రాష్ట్రం తెలంగాణ. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్ పూర్తిగా నిర్మూలించబడింది.

హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చాను. మనం కలిసి అద్భుతాలు చేయవచ్చు. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

### బూర్గంపాడు ఘటన అనుమానుషం

బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళలపై దాడి అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. బూర్గంపాడు ఘటన సీఎం ఆలోచనలకు అద్దం పడుతోందన్నారు. సీఎంగా అలాంటి వ్యక్తి ఉంటే రాజ్యాంగం ఎక్కడ అమలవుతుంది..? దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చే హామీ ఇదేనా..? దేశ మహిళలకు ప్రియాంకా గాంధీ ఇదే గౌరవం కోరుకుంటున్నారా..? మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతున్న సమానత్వం ఇదేనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ నేతలపై పగతోనే కేసులు

## మాజీ మంత్రి హరీశ్‌రావు



**సంగారెడ్డి జిల్లా, జూన్ 21 :** ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు స్పందించారు. కౌశిక్‌రెడ్డిపై పగతో దొంగ కేసు పెట్టి శనివారం చూసి అరెస్టు చేశారని మండిపడ్డారు. శనివారం, ఆదివారం అరెస్టు చేయొద్దని తెలంగాణ హైకోర్టు ఎన్నిసార్లు చెప్పినా లెక్కజేయకుండా కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేశారని ధ్వజమెత్తారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఫార్ములా వన్ రేస్‌ని రాష్ట్రానికి తెచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌ని కూడా రేవంత్ ప్రభుత్వం సతాయించిందని హరీష్‌రావు అన్నారు. రాష్ట్రంలో కేడీలు, బేడీల రాజ్యం నడుస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అంటే రేవంత్‌కి భయం... నిద్రలో కూడా కేసీఆర్ పేరు తలచుకొని భయపడుతున్నారని విమర్శించారు. సీఎం కుర్చీకి ఉన్నా విలువను కూడా రేవంత్‌రెడ్డి తీస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు వెంటనే రైతు భరోసా ఇవ్వాలంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో హరీష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మానిక్‌రావు , ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. కోతల రేవంత్‌రెడ్డి. రైతు అయితే చాలు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. రేవంత్‌రెడ్డి ఓఆర్ఆర్ లోపల ఉన్నా రెండు లక్షల ఎకరాలకు రైతుబంధు ఇవ్వట్లేదు. సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల రైతులపై రేవంత్‌రెడ్డి పగ పెంచుకున్నారు.. వారికి ఎందుకు రైతుబంధు ఇవ్వట్లేదు. సాగులో ఉన్న భూములకు రైతుబంధు ఎందుకు ఇవ్వరు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో లక్ష మందికి పెన్షన్లు తొలగించారు. అన్ని ఎగ్గొడుతున్నందుకే ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటాం. కేసీఆర్ హయాంలో నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే... రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్లకు ఓట్లకు మధ్య ఇస్తున్నారు. ఒక్కో రైతుకు రేవంత్‌రెడ్డి రూ. 12 వేల రైతు భరోసా బాకీ పడ్డారు. ఓట్ల కోసం ఇప్పుడు రైతు భరోసా వేశారు. ఇంకా సగం మందికి రుణమాఫీ కాలేదు. రూ.40 వేల కోట్లు రుణమాఫీ చేస్తానని చెప్పి.. రూ.15 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. రూ. 2 లక్షల్లోపు అందరికీ మాఫీ కాలేదు. రైతు బీమా ప్రీమియం ఆరు నెలలుగా కట్టకపోవడంతో చనిపోయిన రైతు కుటుంబాలకు బీమా డబ్బులు రావడం లేదు. దేవుళ్లపై ఒట్టు వేసి మాట తప్పారు. కేసీఆర్ ఇచ్చిన పథకాల్లో కోతలు పెట్టడం తప్పా కొత్త పథకం ఒక్కటైనా తెచ్చారా. లగచర్ల, పెద్ద ధన్వాడ రైతులకు బేడీలు వేసిన చరిత్ర రేవంత్‌రెడ్డిది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైంది. రైతుబంధు ఇవ్వకపోతే ఓఆర్ఆర్‌ను దిగ్బందిస్తాం. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో ఏ రైతును, స్కూల్ పిల్లాడిని అడిగినా చెబుతారు. తెలంగాణలో అందాల పోటీలు పెడితే ఏం జరిగిందో అందరికీ తెలుసు' అని హరీష్‌రావు పేర్కొన్నారు.

## డయాలసిస్ పేషెంట్లకు చేయూత పెన్షన్లు

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 21 :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డయాలసిస్ పేషెంట్లకు చేయుత పెన్షన్లు ఇవ్వడానికి సిద్ధమైంది. మే నెలలో 4021 మంది డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లను ప్రజా ప్రభుత్వం మంజూరు చేసింది. డయాలసిస్ పేషెంట్లకు నెలకు ప్రభుత్వం రూ.2016 మంజూరు చేసింది. బీఆర్ఎస్ హయాంలో కేవలం 4011 మందికి మాత్రమే డయాలసిస్ పేషెంట్లకు ఆసరా పింఛన్లు వచ్చేవి. ఒక్క మే నెలలోనే అంతకు మంచి పెన్షన్లను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. మంత్రి సీతక్క చొరవతో నూతన లబ్ధిదారులని ప్రభుత్వం ఎంపిక చేస్తోంది. మొదటగా డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లు మంజూరు చేయడానికి ఒకే చెప్పింది. త్వరలో హెచ్ఐవీ పేషెంట్లకు కూడా పెన్షన్లు ఇవ్వడా నికి ఆమోదించింది. తమకు పెన్షన్లు మంజూరు చేయాలని ఇప్పటికే 13 వేల మంది హెచ్ఐవీ భాదితులు దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో అన్నిరకాల నూతన పెన్షన్‌దారులను ఎంపిక చేసే ఛాన్స్ ఉంది. ఆర్థిక శాఖ అనుమతులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కోరింది. అనుమతులు రాగానే నూతన పెన్షన్లు ఇవ్వనుంది. పింఛన్ల కోసం నెలకు రూ.993 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

## కొనసాగుతున్న రైతుభరోసా నగదు జమ

### 9ఎకరాల వరకు ఉన్నవారికి నగదు బదిలీ

**హైదరాబాద్, జూన్ 21 :** అన్నదాతలను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి నగదును జమ చేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా 9 ఎకరాల వరకు ఉన్న రైతులకు నగదు జమ అయ్యింది. రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది. గత కొద్దిరోజుల నుంచి ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. శుక్రవారం 7 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం 905.89 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. శనివారం 9 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు 66.19 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసింది. భూమి పరంగా .. 106 లక్షల ఎకరాలకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.



## జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 21 :** ఆర్థికంగా దేశం బలపడకపోవడానికి దేశ జాభా కారణమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 11ఏళ్ల మోదీ పాలన గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నదే తన కోరిక అన్నారు.

## 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 21 :** అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఇక నుంచి ఏడాదికి 500 మందికి అవకాశం కల్పించనున్నారు. అందుకు సంబంధించిన ఫైలుపై తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, గిరిజన అభివృద్ధి, దివ్యాంగుల, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ తొలి సంతకం చేశారు. సచివాలయంలో 2వ అంతస్తులోని తన చాంబర్‌లో మంత్రిగా శనివారం ఉదయం ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 844 మంది దివ్యాంగులకు రూ.5 కోట్లతో స్వయం ఉపాధి కల్పించే యూనిట్ల మంజూరు, అదేవిధంగా దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి తద్వారా 2367 మందికి 3.50 కోట్లను పంపిణీ చేసే ఫైలుపై సంతకం చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు ఏటా 210 మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నతవిద్యా అభ్యాసానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యను 500 లకు పెంచారు. అందుకు సంబంధించిన ఫైలుపై కూడా మంత్రి సంతకం చేశారు. అదేవిధంగా మేడారం జాతరలో ఏర్పాట్లకు సంబంధించిన రూ.45 కోట్ల పనులకు, రూ.79.61 కోట్లతో గిరిజన విద్యాలయాల మరమ్మతు పనులకు, మినీ గురుకులాల నిర్వహణకు 17.18 కోట్లను, అదేవిధంగా ఐఐటీ, నీట్‌లో ర్యాంకులను సాధించిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం తెలిపారు. అనుమతులు మంజూరు చేశారు. బాధ్యతలను స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, సంజయ్‌కుమార్, ధర్మపురి నియోజకవర్గ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.



## కావాలనే బీఆర్ఎస్ నేతల అరెస్టులు : మధుసూదనాచారి

**హైదరాబాద్, జూన్ 21 :** ప్రజల తరపున ప్రశ్నిస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని మండలిలో బీఆర్ఎస్ పార్టీ పక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. కౌశిక్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఆయనపై ఎన్నో అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే శని, ఆదివారాలు కోర్టుకు సెలువు రోజులని చూసి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసిందన్నారు. రెండు రోజులైనా జైల్లో పెట్టాలని కుట్ర చేశారని విమర్శించారు. అక్రమ కేసులను న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు. కోర్టుల్లో వరస ఎదురు దెబ్బలు తగిలినా నవ్విపోదురు గాక నాకేమిటీ సిగ్గు అనే రీతిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. హామీల అమలు చేతకాక అక్రమ అరెస్టులకు దిగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కృష్ణుడు కూడా శిశుపాలుడి వంద తప్పులను భరించారని, వరసగా తప్పులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పనిసరిగా ప్రజల చేతిలో శిక్ష తప్పదన్నారు. కౌశిక్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## అరెస్టులను ప్రశ్నిస్తున్నందుకు సిగ్గుండాలి : బల్మూరి వెంకట్



**హైదరాబాద్, జూన్ 21 :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ఖండిస్తున్నందుకు సిగ్గుండాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శిం చారు. పైసల దందాలో కౌశిక్‌రెడ్డి అరెస్ట్ అయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీష్‌రావు ఒక్క దొంగకి సపోర్ట్ చేస్తు న్నారని మండిపడ్డారు. ప్రజా సమస్య లపై కౌశిక్‌రెడ్డి ఏమైనా ఉద్యమం చేశా రా అని ప్రశ్నించారు. పైసల కోసం క్రషర్ వాళ్లని బ్లాక్‌మెయిల్ చేసినందుకు కౌశిక్‌రెడ్డిని తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్. కౌశిక్‌రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర కౌశిక్ రెడ్డిదని విమర్శించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి కౌశిక్‌రెడ్డి చాలా పైసలు తీసుకున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను బయట దేశాలకు పంపించినట్లుగా కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించాలని చూశారని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యే బ్లాక్ మెయిలర్ అని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు బాధ పడుతున్నారని చెప్పారు. కౌశిక్‌రెడ్డి ని గెలిపించినందుకు చాలా బాధపడుతున్నారని పేర్కొన్నారు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్. కేటీఆర్, హరీష్‌రావులు దొంగలకు సపోర్ట్ చేయొద్దని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు. మీరు చేసిన దొంగతనాలు బయట పడతాయని బావ బామ్మర్దులు బనకచర్ల విషయంలో ముందుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బనకచర్ల విషయంలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. బావ బామ్మర్దులకు దమ్ము ధైర్యం ఉంటే బనకచర్ల విషయంలో ప్రమాణం చేయాలని బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. వాసాలమర్రిలో ఆగమ్మకు ఇల్లు ఇస్తామని మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని.. ఆ హామీ ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పేపర్ టైగర్ అని ఎద్దేవా చేశారు. ఆగమ్మకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వెల్లడించారు.

## జీహెచ్ఎంసీలో ఒకేసారి 27మంది బదిలీ




**హైదరాబాద్, జూన్ 21 :** టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రక్షాళన మొదలు పెట్టారు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ బల్దియాలో టౌన్ ప్లానింగ్‌లో ఒకేసారి 27 మంది అధికారులను బదిలీ చేస్తూ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆకస్మిక బదిలీలతో టౌన్ ప్లానింగ్ అధికారులు షాక్ అవుతున్న పరిస్థితి. ఆరు జోన్ల పరిధిలో భారీగా అధికారుల బదిలీలు జరిగాయి. ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదలతో ఫోకస్ పెట్టిన కమిషనర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ : నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 21 :** రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశి క్ రెడ్డి అక్రమ అరెస్టు చాలా దారుణమని మండి పడ్డారు. ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. విదేశాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. మనోజ్ రెడ్డి అనే వ్యాపారిని బెదిరించిన కేసులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని వరంగల్ సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం వరంగల్‌కి తరలించారు. ఎమ్మెల్యే తరచూ బెరదింపులకు దిగుతున్నాడని, రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారని మనోజ్‌రెడ్డి భార్య కట్టా ఉమాదేవి హనుమకొండ సుబేదారి పోలీసులకు ఏప్రిల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 308(2), 308(4), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రేవంత్‌వి చిల్లర రాజకీయాలు

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, జూన్ 21 :** సీఎం రేవంత్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలపై నరనరాన విషం నింపుకుని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. మోదీని నొప్పించకుండా.. చంద్రబాబును మెప్పించాలి అనే ధోరణితో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మిడిమిడి జ్ఞానంతో మిడతలా ఎగిసిపడుతున్నాడు. తెలంగాణకు శాపంగా మారాడు రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రజల గురించి రేవంత్ రెడ్డికి పట్టదా..? చంద్రబాబుకు రేవంత్ రుణపడి ఉండాలి తప్పు లేదు. కొడంగల్‌లోనో, నీ ఫార్మ్ హౌజ్‌లో చంద్రబాబు గుడి కట్టుకో తప్పులేదు. చంద్రబాబు గురించి గోదావరి ,కృష్ణా జలాలను ఫణంగా పెడితే మాత్రం రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెడుదాం జాగ్రత్త అని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. బుద్ధి జ్ఞానం లేకే రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు నీళ్ల పట్ల చిత్తశుద్ధి లేదంటున్నాడు. కేసీఆర్‌కు నీళ్లపై శ్రద్ధ లేకుంటే తెలంగాణ ఇంత సస్య శ్యామలం అయ్యేదా..? కేసీఆర్ హయంలో తెలంగాణలోని 86 శాతం సాగు యోగ్యమైన భూమిగా మారింది. రేవంత్ హయంలో 2 శాతం తగ్గింది. కేసీఆర్ గోదావరి జలాలను వాడుకుని తెలంగాణను సస్యశ్యామలం చేశాక రాయలసీమకు నీళ్లివ్వాలి అన్నాడు. ఇందులో తప్పు ఏం ఉంది..? అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ చేసిన వాదనలు రేవంత్ రెడ్డి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఎజెండా నెంబర్ 5ను ఉద్దేశపూర్వకంగా రేవంత్ విస్మరించి ఎజెండా 1 గురించి మాట్లాడుతున్నారు. తెలంగాణ అనుమతి లేకుండా ఏపీలో గోదావరి ప్రాజెక్టులకి అంగీకరించమని కేసీఆర్ స్పష్టం చేశారు. 2023లో హరీష్ రావు కేంద్రానికి రాసిన లేఖను కళ్లు పెద్దవి చేసుకుని చూడు రేవంత్ రెడ్డి వాస్తవాలు తెలుస్తాయి. 2017 జూన్ 26న కృష్ణా జలాల్లో వాటా కోసం మరో లేఖ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం రాసింది. 299 టీఎంసీలు తాత్కాలిక అవగాహన మాత్రమే.. ఫైనల్ అగ్రిమెంట్ కాదు. ఇది రేవంత్‌కు కూడా తెలుసు. సెక్షన్ 3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదన జరగాలని 32 సార్లు లేఖలు రాసి కేసీఆర్ చివరకు విజయం సాధించారు అని శ్రవణ్ గుర్తు చేశారు.

# అధికార లేమితే అరచాక చర్యలు!





అధికారం లేకపోతే ఎంతగా తెగిస్తారనడానికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విపక్షాలే నిదర్శనం. ఏపీలో అయితే జగన్ తన విధ్వంసక రాజకీయాన్ని మరోమారు ప్రయోగిస్తున్నారు. పల్నాడు పర్యటనలో ఆయన చేసిన హంగామా ఇద్దరి ప్రాణాలు తీసింది. చనిపోయిన ఓ వ్యక్తిని పరామర్శించడానికి వెళ్లే క్రమంలో ఇంత హంగామా అవసరమా అన్నదే సామాన్యుల ప్రశ్న. పరామార్శలకు వెళుతున్నారా లేక...రాజకీయ హంగామాకా అన్నది జగన్ జవాబిచ్చుకోవాలి. జగన్ అధికారంలో ఉండగా ప్యాలెస్ దిగిరాలేదు. సామాన్యుల గోడు పట్టించుకోలేదు. అమరావతి రైతుల ఆందోళనలు వినలేదు. చనిపోయిన వారి గురించి ఆలోచించలేదు. ఇలాంటి మనస్తత్వం ఉన్న జగన్ కేవలం రాజకీయ అధికారమే లక్ష్యంగా ఐదేళ్ల పాలన సాగించారు. తెలంగాణ, ఆంధ్రాలో విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాలు తమది.. ఒక్కటే రాగం అన్న చందంగా విమర్శలతో కాలం గడుపుతున్నారు. అప్పుడే కొంపలు అంటుకు పోయాయని, తాము ఉంటే అంటుకునేవి కావన్న రీతిలో గగ్గోలు పెడుతున్న తీరు దారుణంగా ఉంటోంది. తమ పాలనా కాలంలో స్వర్గాన్ఇన భువికి దించామన్న లెవల్లో వీరు ప్రాచరం చేసుకుంటున్నారు.

అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే తమదే అధికారం అని బిఆర్ఎస్ తమ బాకా పత్రికలో కథనాలు రాయించు కుంటోంది. నిజానికి విమర్శలకు కూడా హద్దులు ఉండాలి. రెండు పార్టీల నేతలు రోజూ ఏదో ఒక అంశం తీసుకుని పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే ఒకరోజు మీడియాతో మాట్లాడడం, మరుసటి రోజు దానినే ట్విట్టర్ ద్వారా వల్లించడం, తరవాతి రోజు దానిపై సొంత పత్రికల్లో కథనాలు రాయించడం అలవాటు చేసుకున్నారు.చేతిలో పత్రికలు, బాకా ఛానలళ్లు ఉన్నాయన్న ధైర్యంతో ఏదిపడితే అదే వార్తలుగా మలుస్తున్నారు. ప్రజలసమస్యలు పక్కకు పోయాయి. వారి బాకాలకు ప్రాధాన్యం ఏర్పడింది. నవ్విపోదురు గాక నాకేంటన్న చందంగా .. తమపాలనా కాలంలోని గత పాపాలను ప్రజలు మరచి పోవాలన్న ఏకైక లక్ష్యంతో జంకూగొంకూ లేకుండా విమర్శలతో కాలం గడిపేస్తున్నారు.

ఏపీలో జగన్, తెలంగాణలో కెటిఆర్, హరీష్ రావులు ఈ అబద్దాల ప్రచారంలో ఆరితేరారు. తెలంగాణలో ఇప్పుడు కవిత కూడా బలయుదేరారు. పదేళ్ల అధికారం వెలగబెట్టిన సమయంలో గుర్తుకు రాని సమస్యలన్నీ ఇప్పుడే గుర్తుకు వస్తున్నాయి. బిసిలకు రాజ్యాధికారం, రిజర్వేషన్లు, పూలే విగ్రహాలు అన్నీ కవిత నోటినుంచి తన్నుకు వస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు వివిధ మార్గాల్లో సొంత ఆదాయం పెంచుకున్న వీరు ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబును, రేవంత్‌ను అడ్డగోలుగా దోచుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. అధికారమంటే దోచుకోవడమే అన్న చందంగా ఐదేళ్లు జగన్, పదేళ్లు బిఆర్ఎస్ నేతలు దోచుకున్న విషయాన్ని ప్రజలు ఇంకా మరచి పోలేదు. ప్రభుత్వ వనరులను,ఖజానాను కొల్లగొట్టి తమ సొంత వనరులు సమకూర్చుకున్న నేతలుగా చరిత్రలో వీరు నిలిచి పోయారు. అసలు ఎపి విభజన జరిగిందే వీరి ఆదాయాలు పెంచడానికి అన్న చందంగా రాష్ట్రాల తీరు మారింది. ఇరు రాష్ట్రాలను అప్పుల్లో ముంచేశారు. మరో పదేళ్లయినా కోలుకోలేని విధంగా కుప్ప చేసి వెళ్లారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకుని వచ్చారు. ఎపిలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం సరఫరా చేసిన జగన్ అడ్డంగా దోచుకున్నారు. ఇసుక, మట్టి మాఫజయాలతో పాటు భూకబ్జాలు చెప్పనక్కరలేదు. నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తూ.. గతమంతా బంగారు మయం చేశామని ఈ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు ప్రజలపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్న తీరుతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

అయ్యో జర్నలిస్టులంటూ రాగాలు తీస్తున్నారు. జర్నలిస్టులను అంటరానివారిగా చూసిన ఘనత ఈ ఇద్దరు నాయకులకే చెల్లింది. తెలంగాణలో పదేళ్లపాటు జర్నలిస్టులు అనుభవించిన క్షోభ అంతా ఇంతా కాదు. ప్రజలను ఛీదరించుకునే స్థాయికి దిగజారి, వారిని కనీసం దరిచేరకుండా పాలన చేసి, సిఎం ప్రజలను కలవాల్సిన అవసర మేముందని దబాయింపు మటలు మాట్లాడిన కెటిఆర్ ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు. ఎపిలో జగన్‌దీ అదే పరిస్థితి. ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధంగా లేని నేతలు.. ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండాలనుకుంటున్న నేతలను ప్రజలు సమయం చూసి వాతలు పెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. అలాగే అసెంబ్లీకి రాని, ప్రజల సమస్యలను పట్టించుకోని ఫామ్‌హౌజ్ కే పరిమితమైన కెసిఆర్ విపక్షనేతగా ఉండాలా అన్నది కూడా ప్రజలు ఆలోచించాలి. మల్లన్నసాగర్‌లో ప్రజల జీవితాను ముంచేసిన కెసిఆర్ బృందం ఇప్పుడు మూసీ మురికి బాధితుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు. దోచుకోవడమే పాలన అన్నచందంగా సాగిన వీరి ఆగడాలను భరించలేకే ప్రజలు అధికారం నుంచి దించేశారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పందేరాలు సాగించి, అదే అభివృద్ధి అని నమ్మించి ఎన్నికల్లో ఓటమి పాలైనా వీరికి జ్ఞానోదయం కలగడం లేదు. ఆనాడు దూరం పెట్టిన ప్రజలపై ఇప్పుడు ఎక్కడలేని మమకారం పుట్టుకొస్తోంది. తెలంగాణలోమూసీ మురికి వదలకూడదు. అక్రమంగా రైతుబంధును అమలు చేసిన తీరును అడ్డుకోరాదు. అక్రమంగా బతుకమ్మ చీరల పేరుతో జరిగిన అన్యాయాలను నిలదీయరాదు. నిరుద్యోగులకు టోపీ పెట్టిన వైనాన్ని నిలదీయరాదు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ధరణి అవినీతుల గురించి మాట్లారాదు. ఈ ఫార్ములా రేసులో అప్పనంగా డబ్బులు దాటిస్తే కేసు పెట్టరాదు. పార్టీల ముసుగులో రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ముఠాలు తయారయ్యాయి. ఇదంతా చూస్తున్న తెలుగు ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. మీడియాపై అక్కసు వెళ్లగక్కిన ఇరు రాష్ట్రాల పెద్దలు ఇప్పుడు మీడియాపై ప్రేమ ఒలక బోస్తున్నారు. ఎపిలో ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కో గగ్గోలు పెట్టడం చూస్తే జాలేస్తోంది. అయితే గతంలో అధికారం అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి, అవినీతికి తెగించి, ఆర్థిక విధ్వంసం సృష్టించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం పెరుగుతుంది. తమకేమీ కాదులే అన్న ధీమా రాజకీయ నేతల్లో రాకూడదు. జవాబుదారీతనం తీసుకుని రావాలి. ఇకపోతే గత పదేళ్లలో తెలంగాణను దోపిడీ చేశారని, కాళేశ్వరంను ఎటిఎంలా వాడుకున్నారని గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు కూడా బిఆర్ఎస్ నేతలతో కలసి వంతపాడడం శోచనీయం.

# ఆందోళనకరంగా ఉద్యోగాల కల్పన

- కొత్తవారికి ఎదురుచూపు.. ఉన్నవారి తొలగింపు
- ఫీల్‌గుడ్ భావనలో ప్రధాని మోడీ




**ముంబై, జూన్ 21 :** దేశంలో ఐటి ఉద్యోగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు దిగ్గజ సంస్థలు ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కొత్తగా ఉద్యోగాల కల్పన కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టాలు పుచ్చుకుని బయటకు వస్తున్న వారిలో చాలామంది ఉద్యోగాలు దొరక్క ఆందోళన చెందుతున్నారు. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు ఆరేడు త్రైమాసికాలుగా వెల్లడిస్తున్న ఆర్థిక ఫలితాల్లో నికర ఉద్యోగుల సంఖ్య తగ్గడమే కానీ, పెరిగింది లేదు. అయితే తాజా జులై-సెప్టెంబరు ఫలితాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం, తాజా ఉత్తీర్ణుల ఎంపికలనూ ప్రణాళిక మేరకు చేపడుతున్నామని ఆయా యాజమాన్యాలు ప్రకటించడం.. ఉద్యోగార్థులకు భవిష్యత్తుపై ఆశలు చిగురింప చేశాయనే చెప్పాలి. వివిధ సంస్థల్లో ఉద్యోగుల క్షీణత గణనీయంగా పెరుగుతూ వచ్చింది. కృత్రిమమేధ ప్రాజెక్టుల్లోనూ ఆర్డర్లు వస్తున్నట్లు వెల్లడించడం, అధునాతన సాంకేతికతలపై మన నిపుణులకు ఉన్న సామర్థ్యాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థలు గుర్తించినట్లయ్యింది. కళాశాల ప్రాంగణాల్లో ఎంపిక చేసి, గతంలో ఆఫర్ లెటర్ ఇచ్చిన అందరినీ తప్పనిసరిగా చేర్చు కుంటున్నట్లు ఈ సంస్థలన్నీ ప్రకటించాయి. కానీ జీతాలు పెరిగే కొద్దీ కొత్తవారిని తీసుకుంటూ పాతవారిని తొలగిస్తున్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మోడీ అభివర్ణించారు. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. అంటూ ప్రధాని ఎక్కడికి వెళ్లినా చెబుతున్నారు. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయని గుర్తించడం లేదు.

## భారత్‌తో దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాలు
# మరింత బలోపేతం : పుతిన్




**రష్యా :** భారత్‌తో తాము దీర్ఘకాలికంగా కొనసాగిస్తున్న ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు కృషి చేస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ.. 2030 వరకు దీర్ఘకాలిక సహకారం కోసం మాస్కో కార్యాచరణ ప్రణాళికను త్వరలో ఖరారు చేస్తామన్నారు. చమురు, గ్యాస్ ఎగుమతులు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నా రు. దీనిని ముందుకు తీసుకువెళ్లడానికి తమ భాగస్వాములకు వాణిజ్య అడ్డంకులను తొలగిస్తూ కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నా మని వెల్లడించారు. పెట్టుబడి సహకారాన్ని మరింత పెంచడా నికి కృషి చేస్తున్నామన్నారు. భారత్‌తో సహా పలు ముఖ్య భాగస్వాములతో దీర్ఘకాలిక సహకార ప్రణాళికలను సిద్ధం చేయడానికి రష్యా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భారత్ -రష్యా బిజినెస్ ఫోరమ్‌లో భారత్ తరఫున కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే సెషన్‌లో మంత్రి మాట్లాడుతూ.. భారత్‌లో కృత్రిమ మేధ పురోగతిని, సమ్మిళిత సాంకేతిక వృద్ధిలో దాని పాత్రను వివరించారు. భారత్-రష్యాల మధ్య లోతైన ఆర్థిక సంబంధాలు, సహకారం కోసం మరిన్ని కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రష్యన్ ఫెడరల్ మంత్రులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, సాంకేతిక నాయకులు, పెట్టుబడి దారులతో అశ్విని వైష్ణవ్ సమావేశమయ్యారు. రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైల్వే ఆధునికీకరణ, సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాలలో భారతదేశం-రష్యా సహకారా న్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై వారి మధ్య చర్చలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాంకేతికత ఆధారిత, మౌలిక సదుపాయాల రంగాలలో రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంపొందించడానికి భారత్ నిబద్ధతతో ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం పత్రికా ప్రకటనలో తెలిపింది.

# తప్పిన మరో ప్రమాదం.. 'మేడే కాల్'తో విమానం సేఫ్




**న్యూఢిల్లీ :** ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానానికి ప్రమాదం తప్పింది. 'మేడే కాల్'తో సురక్షితంగా బయటపడింది. గువహటి నుంచి చెన్నైకి వెళుతున్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు సంబంధిత వర్గాల సమాచారం. అసలేం జరిగిందంటే.. గువహటి నుంచి చెన్నైకి ప్రయాణికులతో ఇండిగో విమానం బయలుదేరింది. టేకాఫ్ అయిన కాసేపటికి అందులో ఇంధనం తక్కువగా ఉండడాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే పైలట్ ఏటీసీకి 'మేడే' సందేశం పంపారు. తక్షణమే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. దీంతో విమానానికి ప్రమాదం తప్పింది. ఈ ఘటన మూడు రోజుల క్రితం చోటు చేసుకోగా.. తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నల్లు తెలుస్తోంది. మేడే కాల్ అనేది డిస్ట్రెస్ కాల్. అత్యవసర ప్రమాద పరిస్థితిని ఎదుర్కొంటున్నామనే విషయాన్ని రేడియో కమ్యూనికేషన్ ద్వారా సమీపంలోని ఏటీసీకి తెలియజేయడం కోసం దీన్ని వాడుతారు. ఆపదలో ఉన్నామని, తక్షణమే సాయం అవసరమని విజ్ఞప్తి చేసేందుకు ఉపయోగిస్తారు. కాగా.. ఇటీవల ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం కుప్పకూలింది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది ఓ భవనంపై కూలిపోయింది. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు.

# ఇరాన్‌కు మరో దెబ్బ.. 'ఖుద్స్ ఫోర్స్' కమాండర్ హతం



**ఇరాన్ :** ఇరాన్‌లోని ముఖ్య ప్రదేశాలు, కీలక నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ బాంబు దాడులతో టెహ్రాన్‌పై విరుచుకుపడుతోంది. టెల్ అవీవ్ దాడుల్లో ఇప్పటికే ఎందరో కీలక నేతలను కోల్పోయిన టెహ్రాన్‌కు మరో దెబ్బ తగిలింది. తాజాగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధాల సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహరియారీ హతమయినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్ నుంచి హమాస్, హెజ్‌బొల్లా, హూతీ తదితర సంస్థలకు ఆయుధాల సరఫరాలో షాహరియారీ ప్రధాన పాత్ర పోషించినట్లు తెలిపింది.

### ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్.. డ్రోన్ యూనిట్ కమాండర్ హతం

శుక్రవారం ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు చేసిన దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వైమానిక దళం.. డ్రోన్ యూనిట్ కమాండర్ సయీద్ ఇజాది సహా పలువురు నేతలు మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు శనివారం ధ్రువీకరించాయి. 2023లో అక్టోబర్ 7న జరిగిన ఇజ్రాయెల్‌పై టెహ్రాన్ చేసిన దాడులకు ప్రణాళికలు రచించింది అతడే అని తెలిపాయి. ఇరాన్, హమాస్‌ల మధ్య ఇజాది కీలక సమన్వయ కర్తగానూ వ్యవహరించాడని పేర్కొన్నాయి. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో ఇప్పటి వరకు ఇరాన్‌కు చెందిన సాయుధ దళాల జనరల్ స్టాఫ్ నిఘా డిప్యూటీ జనరల్ ఘోలామ్రేజా మెహ్రాబీ, ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీ, ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) చీఫ్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, దేశ క్షిపణి కార్యక్రమ అధిపతి జనరల్ అమీర్‌అలీ హాజీజదే వంటి కీలక నేతలు మృతి చెందారు. అంతే కాకుండా అణు కార్యక్రమంలో పని చేస్తున్న పలువురు శాస్త్రవేత్తలు సైతం ప్రాణాలు కోల్పోయారు.

# బాలాపూర్‌లో దారుణం..

### అక్కాచెల్లెళ్ల అనుమానాస్పద మృతి



**హైదరాబాద్:** బాలాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. వినీల (17), అఖిల (16) అక్కాచెల్లెళ్లు అనుమానాస్పదంగా మృతి చెందారు. ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. అక్కాచెల్లెళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారా? ఎవరైనా హత్య చేసి ఉంటారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరో వైపు వినీల ఇటీవల ఓ యువకుడిని ప్రేమించి ఇంటి నుంచి వెళ్లిపోగా.. కులాంతర వివాహం వద్దని చెప్పి కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొచ్చినట్లు సమాచారం. అప్పటి నుంచి అక్క, చెల్లి ఇద్దరూ తల్లిదండ్రుల మాట వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది.



## ఆషాఢ బోనాలకు
# రంగం సిద్ధం

### హైదరాబాద్‌లో ఇక సందడిగా జాతర

**హైదరాబాద్, జూన్ 21 :** ఆషాడ జాతర వచ్చేస్తుంది. గోల్కొంబోనాలతో ఆషాఢ బోనాల జాతర ఆరంభం కానుంది. అమ్మవారిని తమ ఇంటి బిడ్డగా భావించి అత్త ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చి ఎంతో అందంగా అలంకరించి ధూప నైవేద్యాలతో సారేతో తిరిగి అత్తింటి వారికి పంపించేటటువంటి సాంప్రదాయమే ఈ బోనాల పండుగ. అంతేకాకుండా వర్షాలు పడేటటువంటి ప్రారంభం. దీంతో పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకునేటటువంటి పండుగ కూడా.. అలాంటి బోనాల పండుగ అతి దగ్గరలోనే ఉంది. ఆషాడ మాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో బోనాలు మొదలవుతాయి. అప్పటి నుంచి నెల రోజుల పాటు జరిగేటటువంటి ఈ పండుగ ఎన్నో విశేషాలతో కొనసాగుతుంది. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. జూన్ 26న గోల్కొండ బోనాలు ఉత్సవాలతో ప్రారంభమవుతాయి. జూన్ 29న విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పిస్తారు. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉంటుంది. ఆ తర్వాత రోజు జులై 14న రంగం భవిష్యవాణి.. జులై 20న భాగ్యనగర లాల్ దర్వాజా బోనాల జాతర ఉంటుంది. జులై 21న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 24న బోనాల ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. నెల రోజులు పాటు జరిగేటటువంటి బోనాలలో భక్తులు రద్దీ నెలకొంటుంది. దేశ విదేశాల నుంచి బోనాల జాతరను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఈ విధంగా ఆషాడ మాసం అనగానే హైదరాబాదులో జరిగే బోనాలు జాతరే గుర్తుకొస్తుంది. ఈసారి ఈ బోనాల జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు కూడా సన్నద్ధమవుతున్నారు.



# 'అసలైన సినిమా మిగిలే ఉంది'..

### గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. "ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 11ఏళ్ల మోదీ పాలన గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నదే తన కోరిక అన్నారు. తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు.



## టీయుజేఏసీ ఆధ్వర్యంలో ప్రొ.జయశంకర్ వర్ధంతి వేడుకలు

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ 14వ వర్ధంతి వేడుకలను తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుక నిర్వహించారు ఈ సందర్భంగా టీయుజేఏసీ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరితపించారని ఆయన కొనియాడారు జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం తెలంగాణ ఉద్యమకాల జాయింట్ యాక్షన్ కమిటీ పని చేస్తుందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉద్యమకారులు వరికుప్పల మల్లేశం కాసుల కృష్ణ రాష్ట్ర కార్యదర్శి మంటి రమేష్,మండల అధ్యక్షులు గాజుల యాదగిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు చేర్యాల సుగుణమ్మ, కొత్త రామచందర్, ఈతప మల్లేశం, గంధ మల్ల గోపాలు, జోగు యాదయ్య. నరసింహ,గంధ మల్ల శ్రీనివాస్. దామోదర్, భూపతి రాములు, తదితరులు పాల్గొన్నారు.



## యోగ శారీరక వ్యాయామమే కాదు జీవన విధానం

**- స్పీకర్ ప్రసాద్ కుమార్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు ఒక జీవన విధానం అని తెలంగాణా రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్లో జరిగిన యోగా డే కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులతో పాల్గొని రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు ఆసనాలు వేశారు. ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని ఆచరించాలన్నారు. యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానమని నేను రోజు యోగా చేస్తానని తెలిపారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో యోగా పట్ల ప్రజలలో ఆసక్తి బాగా పెరిగిందని ఎక్కువ మంది యోగాను చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశంలో 2500 సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ద్వారా యోగ వెలుగులోకి వచ్చిందని ఆయన అన్నారు. ఐక్యరాజ్యసమితి యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రతి సంవత్సరం జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. యోగాను అన్ని వయసుల వారు చేయవచ్చని స్వంతంగా కంటే గురువుల మార్గదర్శకంలో చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయని ఆయన అన్నారు. యోగాను మీ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా జీవిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగాఅంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఇంచార్జి) మహమ్మద్ అబ్దుల్ సత్తార్, ఎల్ డి ఎం యాదగిరి, అయుష్ సునీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

### జెడ్‌సికు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి వినతి



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భారీ భవనంపై తక్షణమే చర్యలు చేపట్టాలని కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శనివారం మధ్యాహ్నం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి ఓ.ఎస్. నేం : 97 ఆఫ్ 2024 లోని 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు 13వ అడిష నల్ ఫస్ట్ క్లాస్ జడ్జి, కూకట్‌పల్లి ఆదేశాల్లో పిటిషనర్ దారుడు అయిన ఆవుల రవీందర్ రెడ్డి కూకట్ పల్లి సర్కిల్ అధికారులు ఆకారంగా అడ్డుతగుతున్నారని వేసిన టెంపరరీ ఇంజక్షన్ ను డిస్మిస్ చేసింది. ఇదే కాకుండా గతంలో ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్ ను వేకేట్ చేసినట్లు తెలిపే కోర్టు కాపీని జోనల్ కమిషనర్ కు అందజేస్తూ పూర్తి వివరాలు వివరించారు. తక్షణమే కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భవనానికి నోటీసు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం సంతకాల సేకరణ

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ మండలంలో శోభన బస్ స్టాప్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి సీపీ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో శోభన బస్ స్టాప్ లో శనివారం సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, సీపీఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ సభ్యులురాలు ఎ. విజయ, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# ‘డీర్ పార్క్ ఆవరణలో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు’

### యోగ గురువు గంధం సోమేశ్వరరావు



**వనస్థలిపురం, రాజముద్ర న్యూస్:** శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ప్రశాంతంగా ఉంచే నిత్య సాధనమే “ యోగా” అని , ఆరోగ్య కర సమాజాన్ని నిర్మించడంలో యోగా ఎంతో తోడ్పాటు నిస్తుందని , నిత్య జీవితంలో ప్రతి ఒక్కరు యోగాను బాగం చేసుకోవాలని అన్నారు. అనంతరం యోగా ప్రాముఖ్యతను డీర్ పార్క్ యోగా గురువు గంధం సోమేశ్వర్ రావు తెలిపారు. శనివారం స్థానిక హరిణ వనస్థలి డీర్ పార్క్ ఆవరణ లో 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా డీర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పలు యోగాసనాలు వేసి..వాకర్స్, యోగా మిత్రులంతా కలిసి యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు..యోగా అనేది కేవలం వ్యాయామం కాదని ఇది మన శరీరానికి ఆరోగ్యాన్ని..మనసుకు ప్రశాంతత ఇస్తుందని తెలిపారు.. ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు యోగా చేసేందుకు సమయం కేటాయించాలని, యోగా వంటి శ్రద్ధా జీవనశైలిని పాటిస్తే ఆరోగ్యంగా మనసు ప్రశాంతంగా ఉంటుందని తద్వారా కుటుంబం సంతోషంగా ఉంటుందని పలువురు వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో డీర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం జగదీష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి మాణిక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీమిడి వెంకట్ రెడ్డి, కోశాధికారి మేకల రమణా రెడ్డి, యోగ అద్యక్షుడు కంది లింగా రెడ్డి, గౌరవాధ్యక్షులు జక్కా రవీందర్ రెడ్డి, చీరిక నర్సి రెడ్డి, బొబ్బలి ప్రకాష్ రెడ్డి, నామిరెడ్డి సుధీర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యాస శంకర్ రెడ్డి, అంతటి అశోక్ గౌడ్, బద్దం మధుసూదన్ రెడ్డి, అంతటి రాజు , అమరేందర్, డీర్ పార్క్ యోగ సభ్యులు, వాకింగ్ సభ్యులు తదితరులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

- జర్నలిజం విలువలు పెంపొందించేందుకు కృషి చేద్దాం
- టీయూడబ్ల్యూజే - ఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమిది బాల్ రాజు గౌడ్




**మేడిపల్లి, రాజముద్ర నివాస్:** నేటి మారిన పరిస్థితులకు అనుగుణంగా జర్నలిజం విలువలను పెంపొందించేందుకు గాను జర్నలిస్టులు సమన్వయంతో ముందుకు సాగాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమిది బాల్ రాజు గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి వెంకట్రాంరెడ్డి లు హాజరయ్యారు. మేడిపల్లి ప్రింట్ మీడియా నూతన అధ్యక్షులుగా చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వడ్డేమాన్ సుందర్, కోశాధికారిగా మరాటి మల్లేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు సమాజిక మాధ్యమాలు విపరీతంగా పెరిగిన దృష్ట్యా జర్నలిస్టులుగా మన కర్తవ్యాలను నిస్సందేహంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా మన పాత్ర ఉండాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకు సాగాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులుగా మన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు దృష్టి సారించాలని అన్నారు. ఈ ఎన్నికలకు సమన్వయ కర్తలు గా వీఎస్ఎన్ రెడ్డి, కల్యారి ఎల్లయ్యలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోశాధికారి ఎన్.రాములు యాదవ్, సభ్యులు ఎస్. సాగర్ రెడ్డి, రావు నాగిరెడ్డి, శేరి కరుణాకర్ రెడ్డి, రేగు శ్రీనివాస్, కుమారస్వామి, రఘు తిరుపతిరెడ్డి, సురేందర్ రెడ్డి, విష్ణు గౌడ్, దయాకర్ రెడ్డి, భాస్కర చారి, శ్రీనివాస్ రెడ్డి, నరసయ్య గౌడ్, భగీరథరెడ్డి, రవి, మత్స్యగిరి, చింత రమేష్, బూష గణేష్, సిహెచ్ గణేష్, అంజన్ కుమార్, సందీప్ రెడ్డి, మధు, సిద్దు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరం

**ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్**



- పీఎం శ్రీ మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో యోగా దినోత్సవ వేడుకలు
- పాఠశాల ఆవరణలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు ఆసనాలు వేయించి యోగా వలన కలిగే లాభాలను వివరించిన ఉపాధ్యాయులు




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** యోగ అనేది ఒక సమగ్రమైన అభ్యాసం, ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. యోగాను క్రమం తప్పకుండా అభ్యసించడం ద్వారా, వ్యక్తులు మరింత ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన సమతుల్య జీవితాన్ని గడపవచ్చునని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం (జూన్ 21) యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా గురువు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థిని, విద్యార్థులచే యోగ ఆసనాలు చేయించి యోగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ మాట్లాడుతూ... యోగం అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రాముఖ్యత కలిగినది అని తెలిపారు. ఇది ఒత్తిడిని తగ్గించడంలో, ఏకాగ్రతను పెంచడంలో, సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. యోగా ద్వారా శారీరక బలం, ఓర్పు పెరుగుతాయి. అలాగే మానసిక ప్రశాంతత, భావోద్వేగ నియంత్రణ కూడా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## యోగను అభ్యసించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

**- ఎస్పీ కె నారాయణరెడ్డి**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జాతి, మత, కుల భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డిఎస్పి వీరేశ్, ధరూరు సర్కల్ ఇన్స్పెక్టర్ రఘు రాములు, మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్, ఆర్ఐ లు డేవిడ్ విజయ్, అంజాత్ పాషా, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొని యోగాసనాలను అభ్యసించారు.



## మంత్రి అడ్డూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు అందజేత

- మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపిన ముదిగొండ రమేష్, యాసారం నగేష్, బొడిగె ఉదయ్ రాజ్ గౌడ్

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ, బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రజాపాలన అందజేస్తుందని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు ముదిగొండ రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ధర్మపురి నియోజకవర్గ శాసనసభ్యులు అడ్డూరి లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ దివ్యాంగుల శాఖ మంత్రిగా సెక్రటేరియట్ లోని తన చాంబర్లో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముదిగొండ రమేష్, యాసారం నగేష్, బొడిగె ఉదయ్ రాజ్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అనేక సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ అందిస్తుందని తెలిపారు. రైతు బంధు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 500 కే గ్యాస్, మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, లాంటి అనేకమైన జనాకర్షక పథకాలతో ముందుకెళ్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయటమే కర్తవ్యం గా అహర్నిశలు శ్రమిస్తుందని తెలిపారు. ఈ ఈ సందర్భంగా మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## నవాబుపేట్ జడ్.పి.హెచ్.ఎస్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**- వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు మల్లేశం, రాజేష్ కుమార్, మండల యువకులు సారా జగన్, ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా భారత దేశ ఋషులు, మునులు ప్రపంచానికి అందించిన ఒక అద్భుతమని భారత ప్రధాని నరేంద్ర మోడీ చొరవతో 2014 ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 193 దేశాలకు 177 దేశాలు ఆమోదం తెలిపాయని అన్నారు. 2015 మొదటి అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుపుకున్నామని తదనంతరం 35 వేల పైగా జనాభాతో యువకులను నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించిందని, ప్రతి ఒక్కరు యోగనూ తమ దినచర్యగా అలవర్చుకోవాలన్నారు. కరోనా సమయంలో యోగ చేసేవారు ఉత్తమమైన స్వస్థత పొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ కార్యదర్శి నవనీత, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి సిబ్బంది, యువకులు లక్ష్మణ్, చంద్రకాంత్, నరసింహ చారి, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీహరి, ప్రభాకర్ చారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## వాకిటి నిషికా రెడ్డిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల మాజీ జడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకిటి పద్మ అనంతరెడ్డి మనమరాలు వాకిటి నిషికారెడ్డి,మొదటి జన్మదిన వేడుకలు నారపల్లి సిబిఎస్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి హాజరై చిన్నారి నిషికా రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కుంభం వెంకట్ పాపిరెడ్డి,కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య తుమ్మల యుగంధర్ రెడ్డి,కేసిరెడ్డి దయాకర్ రెడ్డి,కందాల రామకృష్ణ రెడ్డి, సంజీవరెడ్డి,బత్తిని లింగయ్య, సహదేవ్,చెరుకు శివయ్య, దానయ్య,సతీష్ గౌడ్,వేలిమినేటి సురేష్,కాసుల వెంకన్న,బుర్ర నరసింహ,సుక్క ముత్యాలు,పులిపలుపుల రాములు,ఎస్.కె రసూల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## ఇజ్రాయెల్, ఇరాన్ సంఘర్షణపై
# కేంద్రం మౌనం తగదు
### కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ




**న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్–ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై భారత్ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తప్పుబట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యంలా కన్పిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి భారత దేశ నైతిక, వ్యూహాత్మక సంప్రదాయం నుంచి దూరంగా జరిగినట్లుగా కనిపిస్తోందని అన్నారు. టెహ్రాన్‌పై, టెల్ అవీవ్ చేస్తున్న దాడులు చట్టవిరుద్ధమైనవిగా.. సార్వభౌమాధికార ఉల్లంఘనగా అభివర్ణించారు. ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల వల్ల ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని సోనియా పేర్కొన్నారు. ఈ ఘర్షణలు అస్థిరతను మరింత తీవ్రతరం చేయడం వల్ల మరిన్ని సంఘర్షణలకు బీజాలు వేస్తాయన్నారు. ఇరాన్, అమెరికాల మధ్య అణు చర్చలకు మార్గం సుగమం అవుతున్న సమయంలో టెల్ అవీవ్ ఒక్కసారిగా టెహ్రాన్‌లోని అణుస్థావరాలపై దాడులకు దిగడం సరైన చర్య కాదని సోనియా అభిప్రాయం వ్యక్తంచేశారు. మరోవైపు ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమంలో గాజాలో 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుతం గాజా కరవు అంచున ఉండడంతో అక్కడ మిగిలిఉన్న ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గాజాలో జరిగిన విధ్వంసం మళ్లీ ఇరాన్‌లో పునరావృతం అవకుండా మరింత ఆలస్యం అవ్వకముందే భారత్ కల్పించుకోవాలని అన్నారు. భారత్‌కు ఇరాన్–ఇజ్రాయెల్‌లతో దీర్ఘకాలిక దౌత్య సంబంధాలు ఉన్నాయని సోనియా అన్నారు. ఇటీవల కాలంలో న్యూదిల్లీ, టెల్‌అవీవ్ మధ్య రక్షణ, వాణిజ్యం, నిఘా సహకారాన్ని విస్తరించినప్పటికీ.. టెహ్రాన్‌తో లోతైన చారిత్రక, నాగరిక, వ్యూహాత్మక సంబంధాలను కూడా కొనసాగిస్తోందని ఆమె పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, యుద్ధ నివారణ విషయంలో ఇరుదేశాలు చర్చలు జరపడానికి భారత్ తనవంతు చర్యలు తీసుకోవాలని సోనియా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో శుక్రవారం ఇరాన్ దౌత్యవేత్త మొహమ్మద్ జావాద్ హొస్సేనీ మాట్లాడుతూ..తమపై ఇజ్రాయెల్ చేపడుతున్న దురాక్రమణను బహిరంగంగా ఖండించాలని భారత్ సహా ప్రపంచ దేశాలను కోరారు. ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ.. తమ దేశంలోని కీలక ప్రాంతాలను ధ్వంసం చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## అణ్వాయుధాలే ఇరాన్ లక్ష్యమని
# చెప్పేందుకు ఆధారాల్లేవు: పుతిన్



**ఇరాన్ :** ఇరాన్ పెద్ద మొత్తంలో అణ్వాయుధాలను తయారు చేస్తోందని.. దానివల్ల తమ అస్తిత్వానికి ముప్పు పొంచి ఉండడంతో అక్కడి అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నట్లు ఇజ్రాయెల్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ.. అణ్వాయుధ తయారీకి ఇరాన్ సన్నాహాలు చేస్తోందని చెప్పేందుకు ఎటువంటి ఆధారాలు లేవని అన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే ఇజ్రాయెల్‌కు పలుమార్లు స్పష్టం చేశామని పుతిన్ ఓ ఇంటర్వ్యూలో తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. శాంతియుత అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకునే హక్కు ఇరాన్‌కు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఆ దేశానికి మద్దతు ఇవ్వడానికి రష్యా ఎప్పటికీ సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ఎలా ఆపాలనే విషయంపై తాము ఇరుదేశాల నేతలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తామంటూ కొన్ని దశాబ్దాలుగా టెహ్రాన్ బహిరంగంగానే సవాల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునేందుకు ఆ దేశం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు టెల్ అవీవ్‌కు నిఘా వర్గాల సమాచారం అందడంతో వాటిని ధ్వంసం చేయాలనే లక్ష్యంతో నెతన్యాహు ఇరాన్‌పై దాడులకు ఆదేశాలిచ్చారు. ఇటీవలి కాలంలో ఇరాన్ అధిక మొత్తంలో యురేనియంను శుద్ధి చేసిందని.. దాంతో తొమ్మిది అణుబాంబులు తయారు చేయొచ్చని ఆయన వెల్లడించారు. ఇప్పుడా దేశాన్ని ఆపకపోతే.. అతి తక్కువ సమయంలోనే అణ్వాయుధాలను తయారు చేస్తోందని.. అది ఇజ్రాయెల్‌కు పెను ప్రమాదంగా పరిణమిస్తుందని తెలిపారు. నాజీల దురాగతాల నుంచి తాము పాఠాలు నేర్చుకున్నాం కాబట్టి.. మరోసారి బాధితులుగా మిగలాలను కోవట్లేదని అందుకే 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో టెహ్రాన్‌పై దాడులు కొనసాగిస్తున్నామని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని ఆరోపించారు. దీనిని నివారించడానికి తమ దేశంతో అణు ఒప్పందం చేసుకోవాలని సూచించారు. అలా కాని పక్షంలో పరిస్థితులు మరింత తీవ్రంగా ఉంటాయని పలుమార్లు ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ యుద్ధంలో అమెరికా చేరికపై స్పష్టతనివ్వనప్పటికీ.. టెహ్రాన్ ఇప్పటికే హద్దులు దాటిందని, దీనిపై స్పందించడం ఆలస్యమైందన్నారు.

## ఇరాన్ కీలక అణుకేంద్రాలే లక్ష్యంగా
# విరుచుకుపడిన ఇజ్రాయెల్



**ఇరాన్ :** ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే ఏకైక లక్ష్యంతో దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ తాజాగా దాడులను ఉధృతం చేసింది. ఇరాన్‌లోని కీలక ఇస్ఫహాన్ అణు కేంద్రం లక్ష్యంగా ఇజ్రాయెల్ తాజాగా దాడులకు పాల్పడిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదకర వాయువులు లీక్ అవ్వలేదని అన్నారు. దాడులు జరిగిన ప్రదేశంలో అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే పరికరాలు, ప్రాజెక్టులు ఉన్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వైమానిక దళం.. డ్రోన్ యూనిట్ కమాండర్‌ను చంపాయని ఐడీఎఫ్ ప్రకటించింది. టెల్ అవీవ్‌పై ఇరాన్ చేసిన వందలాది డ్రోన్ దాడులకు అతడు ప్రాతినిధ్యం వహించాడని తెలిపింది. టెహ్రాన్ సహా ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. పశ్చిమ ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కాస్పియన్ సముద్రం సమీపంలోని రాస్త్ నగరంపైనా టెల్‌అవీవ్ బాంబులతో విరుచుకుపడింది. దీనికి ప్రతిగా ఇరాన్ చేస్తున్న దాడుల్లో గోలన్ హైట్స్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌లు మోగుతున్నాయి. ఇరాన్ ప్రయోగించిన అనేక డ్రోన్లను జనావాసాలు లేని ప్రాంతాల్లో కూల్చివేయడంతో ప్రజలకు ఎటువంటి హానీ జరగలేదని ఇజ్రాయెల్ తెలిపింది. శుక్రవారం ఐడీఎఫ్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు.

# 'ఓటర్ల గోప్యతకు భంగం'
## 'మహా' పోలింగ్ సీసీ ఫుటేజీల డిమాండ్‌పై ఈసీ




**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలు బహిర్గతం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. అలా చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ చర్య ఓటర్ల గోపత్యకు భంగం కలిగించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. గతేడాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. పోలింగ్ సమయంలో అక్రమాలు జరిగాయని.. కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలోనే పోలింగ్‌కు సంబంధించి 45 రోజుల సీసీటీవీ ఫుటేజీను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశాయి. "2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్రతో సహా అన్ని రాష్ట్రాల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏకీకృత, డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలి. అంతేకాకుండా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని కూడా ఈసీ బహిర్గతం చేయాలి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఈసీ స్పందించింది. "ఒక సమూహం లేదా ఓటర్‌ను సులభంగా గుర్తించేందుకు వీలుగా సీసీటీవీ ఫుటేజీ ఉపయోగపడుతుంది. దీన్ని బహిర్గతం చేయడం ద్వారా ఓటు వేసిన వారు, వేయని వారు సామాజిక వ్యతిరేక శక్తుల నుంచి ఒత్తిడికి గురవుతారు. ఓటర్లను బెదిరించే అవకాశం లేకపోలేదు. కాబట్టి, ఈ ఫుటేజీని బహిర్గతం చేయడం నిబంధనలకు వ్యతిరేకం. అలా చేస్తే చట్టపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ వీడియోలు అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే. ఎన్నికల కేసులో ఏదైనా కోర్టు కోరితే మాత్రమే ఆ న్యాయస్థానానికి ఈ వివరాలు చేరుతాయి" అని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. 45 రోజుల్లోపు ఫిర్యాదులు రాకపోతే ఎన్నికల సీసీటీవీ ఫుటేజీలు తొలగించనున్నట్లు ఈసీ ఇటీవల తెలిపింది. ఎన్నికల సరళి వీడియోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉండటంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులకు సూచనలు చేసింది. ఎన్నికలపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు, కోర్టు కేసులు లేకపోతే ఫుటేజీలు తొలగించాలని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ డేటా 45 రోజుల తర్వాత తొలగించవచ్చని పేర్కొంది.

# అతుకులు మనకు.. లాభాలు చైనాకు
## మేకిన్ ఇండియాపై రాహుల్ సెటైర్లు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం చేపట్టిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. దాని వల్ల మనకు కేవలం అతుకులు మాత్రమే మిగులుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమం వల్ల మనకంటే ఎక్కువగా చైనానే లాభాలు ఆర్జిస్తోందని ఆరోపించారు. దేశంలో తయారీ రంగం తగ్గుతుండడంతో నిరుద్యోగం పెరిగిందన్నారు. దిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 'నెహ్రూ ప్లేస్'లో పర్యటించిన రాహుల్ గాంధీ.. అక్కడ పనిచేసే ఇద్దరు టెక్నీషియన్లతో ముచ్చటించారు. అందుకు సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "మేకిన్ ఇండియాతో ఫ్యాక్టరీ రంగం అమాంతం పెరుగుతుందని కేంద్రం చెప్పింది. మరి ఎందుకు తయారీ రికార్డు కనిష్ఠానికి పడిపోయింది? యువత నిరుద్యోగిత రేటు ఎందుకు భారీగా పెరిగింది? చైనా నుంచి దిగుమతులు ఎందుకు రెండు రెట్లు పెరిగాయి?" అని కాంగ్రెస్ ఎంపీ ప్రశ్నించారు. "ప్రధాని మోదీజీ నినాదాలు చెప్పడంలో మాస్టర్.. పరిష్కారాలు చూపడంలో కాదు. 2014 నుంచి తయారీ రంగం మన ఆర్థిక వ్యవస్థలో 14 శాతానికి పడిపోయింది. నిజం నిక్కచ్చిగా ఉంటుంది. అదేంటంటే.. మనం వస్తువులను అసెంబ్లింగ్ చేస్తున్నాం, దిగుమతి చేసుకుంటున్నాం. కానీ, వాటిని తయారుచేయట్లేదు. అందుకే వాటిని తయారుచేస్తున్న చైనా లాభపడుతోంది" అని రాహుల్ విమర్శించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను కూడా నెమ్మదినెమ్మదిగా వెనక్కి తీసుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తయారీ రంగంలో సంస్కరణలు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. "ఇతరులకు మనం మార్కెట్‌గా ఉండకూడదు. ఇక్కడే ఉత్పత్తి చేస్తే.. ఇక్కడే కొనుగోళ్లు చేస్తాం. సమయం లేదు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

# ఆ సీనియర్ అధికారులను తొలగించండి
## ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం




**అహ్మదాబాద్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ ఇటీవల కుప్పకూలి మంటల్లో దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలోనే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ ముగ్గురు అధికారులు సిబ్బంది షెడ్యూల్, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. "నిబంధనలు సరిగా పాటించకపోవడం వల్లే వారిపై చర్యలకు డీజీసీఏ ఉపక్రమించింది. లైసెన్సింగ్, సర్వీసింగ్ లోపాలు ఉన్నా ఎయిరిండియా విమాన సిబ్బందిని షెడ్యూల్ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎయిర్‌లైన్స్ వెల్లడించిన విషయాల ఆధారంగా అలసత్వంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేయాలని సిఫార్సు చేసింది. నిబంధనలు పాటించకుండానే షెడ్యూల్ చేశారు. అంతేకాకుండా, వారు ఈ తప్పిదాలపై జవాబుదారీతనంతో వ్యవహరించలేదు. ఎలాంటి జాప్యం చేయకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీసీఏ పేర్కొంది. వెంటనే వారిపై అంతర్గత క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యలను 10 రోజులలోపు డీజీసీఏకి నివేదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది" అని వెల్లడించాయి. అంతేకాకుండా వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొత్త వారినే కొనసాగించాలని తెలిపింది. బెంగళూరు నుంచి లండన్‌కు బయలుదేరిన రెండు విమానాల సమయ పరిమితి 10 గంటలు ఆలస్యంగా చేరుకొన్నాయి. దీనిపై డీజీసీఏ ఎయిర్‌లైన్స్ ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీటికి సమాధానం చెప్పాలని ఏడు రోజుల గడువు విధించింది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళుతున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది ఓ భవనంపై కూలిపోయింది. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు విమానం కూలినచోట మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంలో ఉన్న వైద్య విద్యార్థులు, పలువురు స్థానికులు కూడా కన్నుమూశారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 272 మంది. మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి, వారి కుటుంబీకులకు అందజేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే డీజీసీఏ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ ముగ్గురు అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ఆపరేషన్ సింధు.. పొరుగుదేశాలకు భారత్ ఆపన్నహస్తం



**ఇరాన్ :** ఇరాన్ – ఇజ్రాయెల్ పరస్పర దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈక్రమంలో న్యూదిల్లీ 'ఆపరేషన్ సింధు' చేపట్టి అక్కడి భారతీయులను వెనక్కి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా పొరుగుదేశాలకు చెందిన విద్యార్థులను కూడా అక్కడినుంచి తరలిస్తూ భారత్ తన గొప్ప మనసు చాటుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తమ విద్యార్థులను కూడా ఆ ప్రాంతం నుంచి తరలించాలని నేపాల్, శ్రీలంక దేశాలు భారత్‌ను కోరాయి. దీంతో ఆయా దేశాల పౌరులను ఆపరేషన్ సింధులో భాగంగా విమానాల్లో తరలించాలని నిర్ణయించింది. టెహ్రాన్‌లో భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది. ఇదిలాఉండగా.. ఆపరేషన్ సింధులో భాగంగా ఇప్పటివరకు 517 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారని భారత విదేశాంగశాఖ శనివారం తెలిపింది. ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు, యాత్రికులతో సహా 290 మంది శుక్రవారం అర్ధరాత్రి ప్రత్యేక విమానంలో దిల్లీకి చేరుకున్నట్లు వెల్లడించింది. కాగా.. ఇటీవల 110 మంది విద్యార్థులు ఇరాన్ నుంచి స్వదేశానికి చేరుకున్నారు. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఈక్రమంలో అక్కడి భారతీయులను తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఉద్రిక్తతల నేపథ్యంలో తన గగనతలాన్ని మూసివేసిన ఇరాన్.. భారత్ కోసం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చింది. దీంతో 3 విమానాల్లో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు స్వదేశానికి రానున్నారు. అందులో ఇప్పటికే 517 మంది చేరుకోగా.. మిగిలిన వారిని కూడా రప్పించేందుకు భారత్ కృషి చేస్తోంది.

# ఆ నీళ్లను మళ్లిస్తాం..
## పాక్ గొంతు ఎండాల్సిందే : అమిత్ షా



**న్యూఢిల్లీ :** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు..!

### మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..

ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. "నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది" అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## భారత్‌లో ఏ ఉగ్రదాడి జరిగినా
# పాక్ మూల్యం చెల్లించుకోక తప్పదు
### రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భవిష్యత్తులో దేశంలో ఏ ఉగ్రదాడి జరిగినా పాకిస్థాన్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని ఉదంపుర్‌లో ఆయన యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. పాక్ ఇలాగే ఉగ్రవాదానికి మద్దతిస్తూ ఉంటే.. అందుకు ఆ దేశం అత్యంత దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకోవడానికైనా మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. 2016లోని సర్జికల్ స్ట్రైక్, 2019లోని వైమానిక దాడులకు కొనసాగింపే ఆపరేషన్ సిందూర్ అని ఆయన పేర్కొన్నారు. తమ 'థౌజండ్ కట్' పాలసీ పనిచేయదని ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు అర్థమైందన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా పాక్‌లోని ఉగ్రస్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ దాడులకు వణికిపోయిన పాక్ చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ సైతం అంగీకరించింది.

## యుద్ధంలో అమెరికా చేరితే
# ప్రతి ఒక్కరికీ ప్రమాదమే : ఇరాన్ మంత్రి



**ఇరాన్ :** ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు కొనసాగుతుండడంతో రోజురోజుకు యుద్ధం తీవ్రమవుతోంది. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. యుద్ధం విషయంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై రెండు వారాల్లోగా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ఇజ్రాయెల్‌తో అమెరికా జట్టుకడితే కేవలం ఇరాన్‌కే కాకుండా ప్రతి ఒక్కరికీ ప్రమాదం పొంచి ఉన్నట్లే అని అన్నారు. ఈ యుద్ధం విషయంలో అమెరికా సైనిక ప్రమేయం గురించి ఆ దేశాధ్యక్షుడు యోచిస్తుండడం చాలా దురదృష్టకరమని అబ్బాస్ అరాఘ్చి పేర్కొన్నారు. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి తీసుకోవాల్సిన దౌత్యపరమైన నిర్ణయాలపై చర్చలు జరిపేందుకు యూరోపియన్ విదేశాంగ మంత్రులతో అరాఘ్చి చర్చలు జరిపారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించు కున్నామని తెలిపారు. అమెరికా ఓ వైపు తమపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు రహస్యంగా మద్దతునిస్తూ..మరోవైపు అణు ఒప్పంద చర్చలకు ఆహ్వానించడం సరైన చర్య కాదని అన్నారు. అగ్రరాజ్యంతో అణు చర్చలు జరపడానికి ఇప్పట్లో తాము సిద్ధంగా లేమని పునరుద్ఘాటించారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడాన్ని ఆపడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ టెహ్రాన్‌లోని అణుస్థావరాలే లక్ష్యంగా వరుస దాడులకు పాల్పడుతోంది. తమకు ముప్పు పొంచి ఉండడం వల్లే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక



## అప్పుడు "స్టుపిడ్.. స్టుపిడ్.. స్టుపిడ్"..
## ఇప్పుడు 'సూపర్బ్.. సూపర్బ్.. సూపర్బ్"



**లీడ్స్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత వికెట్‌కీపర్ రిషభ్ పంత్ (134బీ 178 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) శతకంతో విరుచుకుపడ్డాడు. దీంతో అతడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. గత బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో పంత్ నిరాశపర్చాడు. మెల్‌బోర్న్ టెస్టులో స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో చెత్త షాట్ ఆడి పంత్ ఔటయ్యాడు. ఆ సమయంలో కామెంట్రీ చేస్తున్న సునీల్ గావస్కర్ "స్టుపిడ్.. స్టుపిడ్.. స్టుపిడ్" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఇంగ్లాండ్‌పై పంత్ అద్భుతమైన సెంచరీ చేసిన సమయంలోనూ గావస్కర్ కామెంట్రీ బాక్స్‌లో ఉన్నారు. ఈ సారి ఆయన "సూపర్బ్.. సూపర్బ్.. సూపర్బ్" అంటూ పంత్‌ని ప్రశంసించారు. సెంచరీ అనంతరం పంత్ 'సోమర్‌సాల్ట్' విన్యాసంతో వినూత్నంగా సంబరాలు చేసుకున్నాడు. 27 ఏళ్ల పంత్ ఇప్పటివరకు టెస్టుల్లో ఏడు సెంచరీలు చేయగా.. ఇందులో ఐదు విదేశీ గడ్డపై చేసినవే కావడం గమనార్హం.





## డుప్లెసిస్ సెంచరీ వృథా..
### టెక్సాస్‌పై శాన్‌ఫ్రాన్సిస్కో ఘన విజయం

అమెరికాలో మేజర్ లీగ్ క్రికెట్ 2025 ఉత్సాహంగా సాగుతోంది. డాలస్‌లోని గ్రాండ్ ప్రెయిరీ స్టేడియం వేదికగా టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ అద్భుత విజయం సాధించింది. టెక్సాస్ ఆటగాడు డుప్లెసిస్ శతకంతో రాణించినప్పటికీ.. ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. శాన్‌ఫ్రాన్సిస్కో 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 198 పరుగులు చేసింది. ఓపెనర్ డుప్లెసిస్ 51 బంతుల్లో 100 రన్స్ చేశాడు. కాన్వే (23), సాయితేజ ముక్కమల్ల (38) ఫర్వాలేదనిపించారు. శాన్‌ఫ్రాన్సిస్కో బౌలర్లు జేవియర్ బార్ట్‌లెట్, హారిస్ రౌఫ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఆ తర్వాత 199 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ జట్టు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. కేవలం మూడు వికెట్లు కోల్పోయి 16.1 ఓవర్లలో 202 పరుగులు నమోదు చేసింది. ఓపెనర్లు మాథ్యూ షార్ట్ (61), ఫిన్ అలెన్ (78) అర్ధశతకాలతో రాణించారు. వీరికి జేక్ ఫ్రేజర్ (37) అండగా నిలిచాడు. దీంతో ఇంకా 23 బంతులు మిగిలిఉండగానే శాన్‌ఫ్రాన్సిస్కో విజయాన్ని సొంతం చేసుకుంది. టెక్సాస్ బౌలర్లలో ఆడమ్ మిల్నె, మిచెల్, మహ్మద్ మోహసిన్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు.

# పంత్ మెరుపు శతకం

- అనూహ్యంగా కుప్పకూలిన భారత్
- తొలి ఇన్నింగ్స్‌లో 471కే ఆలౌట్
- ఇంగ్లాండ్ 209/3



**లీడ్స్ :** అండర్సన్–తెందుల్కర్ ట్రోఫీలో తొలి టెస్టును తొలి ఘనంగా ఆరంభించిన టీమ్ఇండియా.. రెండో రోజు పట్టు విడిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 550–600 స్కోరు చేసేలా కనిపించిన భారత్.. 471 పరుగులకే ఆలౌటైంది. శనివారం రిషబ్ పంత్ (134బీ 178 బంతుల్లో 12ఐ4, 6ఐ6) అద్భుత శతకంతో భారీ స్కోరుకు బాటలు పరిచినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్ అనుకున్న దాని కంటే తక్కువ స్కోరే చేసింది. ఆలస్యంగా అయినా ఇంగ్లాండ్ పేసర్ జోష్ టంగ్ (4/86) అదరగొట్టాడు. స్టోక్స్ (4/66) రెండో రోజు మరో రెండు కీలక వికెట్లు తీశాడు. తొలి రోజు సెంచరీ చేసిన శుభ్‌మన్ గిల్ 147 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లిష్ జట్టు.. ఆట చివరికి 209/3తో నిలిచింది. జాక్ క్రాలీ (4) ఆరంభంలోనే వెనుదిరిగినా.. ఓలీ పోప్ (100 బ్యాటింగ్‌బీ 131 బంతుల్లో 13ఐ4), బెన్ డకెట్ (62బీ 94 బంతుల్లో 9ఐ4) కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితికి చేర్చారు. భారత బౌలర్లలో బుమ్రా (3/48) రాణించాడు. ఆట చివరికి పోప్‌కు తోడుగా హ్యారీ బ్రూక్ (0) క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 262 పరుగులు వెనుకబడి ఉంది.

**ఆరంభం అదిరినా..:**

బ్యాటింగ్‌లో గొప్ప స్థితి నుంచి అనూహ్యంగా కుప్పకూలిన భారత్‌కు బౌలింగ్‌లో శుభారంభం దక్కింది. ఓపెనర్ జాక్ క్రాలీని తొలి ఓవర్లోనే స్లిప్ క్యాచ్‌తో ఔట్ చేసిన బుమ్రా.. జట్టులో ఉత్సాహం నింపాడు. బుమ్రా బుల్లెట్ బంతుల్ని, వాటిని ఆడలేక డకెట్, పోప్‌ల తడబాటు చూస్తే.. తర్వాత కూడా వికెట్ల పతనం కొనసాగుతుందనే అనిపించింది.



అందుకు తగ్గట్లే అతను అవకాశాలు సృష్టించాడు కూడా. కానీ 15 పరుగుల వద్ద డకెట్ ఇచ్చిన క్యాచ్‌ను జడేజా వదిలేయడం ఇంగ్లాండ్‌కు బాగా కలిసొచ్చింది. తర్వాత డకెట్ చెలరేగి ఆడాడు. పోప్ తడబడుతూనే స్కోరు పెంచుతూ పోయాడు. క్రమంగా ఇద్దరిపై ఒత్తిడి ఎగిరిపోయింది. బుమ్రా మినహా బౌలర్లు అంత ప్రభావవంతంగా కనిపించలేదు. సిరాజ్ కొంచెం పర్వాలేదు కానీ.. ప్రసిద్ధ్, శార్దూల్, జడేజా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. శతక భాగస్వామ్యం తర్వాత డకెట్.. బుమ్రా బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. ఆపై రూట్‌తో కలిసి పోప్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలోనే అతను శతకం పూర్తి చేశాడు. 206/2తో ఇంగ్లాండ్ పటిష్ట స్థితికి చేరుకుంది. మరో వికెట్ లేకుండానే ఆ జట్టు రోజు ముగించేలా కనిపించగా.. బుమ్రా ఆఖర్లో రూట్ (28)ను ఔట్ చేసి భారత్‌కు కాస్త ఉపశమనాన్నిచ్చాడు. రెండో రోజు చివరి ఓవర్లో బుమ్రా మరో వికెట్ కూడా తీశాడు. బ్రూక్‌ను డకౌట్ చేశాడు. కానీ అది నోబాల్ కావడంతో ఇంగ్లాండ్ ఊపిరి పీల్చుకుంది.

**ఎంతో అనుకుంటే..:**

తొలి రోజు 359/3తో సిరీస్‌ను గొప్పగా ఆరంభించి, రెండో రోజు కూడా ఉదయం ఆధిపత్యం చలాయించిన భారత్.. 471 పరుగులకు ఇన్నింగ్స్‌ను ముగించడం అనూహ్యం. 127 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన శుభ్‌మన్ ఓవైపు ఆచితూచి ఆడుతుంటే.. మరో ఎండ్‌లో రిషబ్ పంత్ (ఓవర్‌నైట్ 65) చెలరేగి ఆడాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. పంత్ తనదైన శైలిలో కిందికి పడుతూ ప్యాడిల్ స్వీప్‌తో అలవోకగా బౌండరీలు రాబట్టాడు. క్రీజు వదిలి భారీ సిక్సర్లూ బాదాడు. చూస్తుండగానే అతడి శతకం (146 బంతుల్లో) పూర్తయింది. దీంతో పాటే నాలుగో వికెట్ భాగస్వామ్యం 200 పరుగులు దాటింది. శుభ్‌మన్ 150 మైలురాయికి చేరువ కాగా.. భారత్ 430/3తో తిరుగులేని స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో శుభ్‌మన్‌ను బషీర్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ పోటీలోకి వచ్చింది. ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్.. నాలుగో బంతికే స్టోక్స్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఈ దశలో పంత్ దూకుడుగా ఆడుతూ స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. కానీ 17 ఓవర్లు వేసినా వికెట్ తీయలేకపోయిన పేసర్ జోష్ టంగ్.. పంత్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని ఆటను మలుపు తిప్పాడు. ఇంకో అయిదు ఓవర్లకే భారత ఇన్నింగ్స్ ముగిసిపోయింది. శార్దూల్ (1), బుమ్రా (0), జడేజా (11), ప్రసిద్ధ్ (1) పెవిలియన్‌కు క్యూ కట్టేశారు.

**తొలి రోజు సుదర్శన్.. రెండో రోజు కరుణ్**

కోహ్లి, రోహిత్ రిటైర్మెంట్‌తో అనుకోకుండా ఇంగ్లాండ్ పర్యటనలో ఆడే అవకాశం అందుకున్నారు సాయి సుదర్శన్, కరుణ్ నాయర్. లేకుంటే వీరికి ఛాన్స్ దక్కేది కాదేమో! సుదర్శన్ భారత టెస్టు జట్టులోకి రావడం ఇదే తొలిసారి కాగా.. కరుణ్ నాయర్ ఎనిమిదేళ్ల తర్వాత పిలుపు అందుకున్నాడు. ఈ ఇద్దరికీ తొలి టెస్టుకు తుది జట్టులోనూ చోటు లభించింది. కానీ తొలి ఇన్నింగ్స్‌లో ఇద్దరూ అవకాశాలను వృథా చేసుకున్నారు. చెరో నాలుగు బంతులాడి డకౌటయ్యారు. తొలి రోజు లెగ్ సైడ్ బంతిని అనవసరంగా వెంటాడి వికెట్ కీపర్‌కు దొరికిపోయాడు సుదర్శన్. రెండో రోజు కరుణ్.. ఆఫ్ సైడ్ దూరంగా వెళుతున్న బంతికి కవర్స్‌లో షాట్ ఆడబోయి ఓలీ పోప్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆచితూచి ఆడాల్సిన స్థితిలో అనవసర షాట్లు ఆడి ఇద్దరూ ఔటయ్యారు. మరి రెండో ఇన్నింగ్స్‌లో అయినా సుదర్శన్, కరుణ్ తమదైన ముద్ర వేస్తారేమో చూడాలి.



## హెచ్‌డీఎఫ్‌సీని ఐసీఐసీఐ
## కొనుగోలు చేయాలనుకుందా?

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన మార్టిగేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీని మరో ప్రైవేటురంగ బ్యాంక్ ఐసీఐసీఐ కొనుగోలు చేయాలనుకుందా? అంటే అవుననే అంటున్నారు హెచ్‌డీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్ దీపక్ పరేఖ్. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనానికి ముందు ఈ ప్రతిపాదన తన వద్దకు వచ్చిందని చెప్పారు. ఐసీఐసీఐ మాజీ సీఈఓ చందాకొచ్చర్‌కు చెందిన యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓగా చందాకొచ్చర్ ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదన రావడం గమనార్హం.**

బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు పలు అంశాలపై చందాకొచ్చర్‌తో మాట్లాడిన పరేఖ్.. హెచ్‌డీఎఫ్‌సీ విలీన అంశం గురించి కూడా మాట్లాడారు. "హెచ్‌డీఎఫ్‌సీని.. ఐసీఐసీఐ ప్రారంభించింది కదా! మరి మీరెందుకు మళ్లీ విలీనం చేయకూడదన్న ప్రశ్న మీ నుంచి వచ్చింది" అంటూ నాటి రోజుల నుంచి గుర్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ విషయం గురించి తానెక్కడా మాట్లాడలేదని పేర్కొన్నారు. అప్పట్లో తిరస్కరించడానికి గల కారణాలను వివరించారు. "విలీనం ఏమాత్రం సరికాదని నాడు తోసిపుచ్చా. మా పేరు, బ్యాంక్, ఇలా చాలా అంశాలు అందుకు కారణం" అని పరేఖ్ పేర్కొన్నారు. 2009 నుంచి 2018 వరకు ఐసీఐసీఐ సీఈఓగా చందాకొచ్చర్ వ్యవహరించారు. హెచ్‌డీఎఫ్‌సీ.. తన బ్యాంకింగ్ విభాగంలో 2023లో విలీనం అయ్యింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనానికి ఆర్‌బీఐ కూడా ఎంతో సహకారం అందించిందని పరేఖ్ పేర్కొన్నారు. అలాగని, రాయితీలు, గడువు వంటి రూపంలో కాదన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రివర్స్ మెర్జర్‌ను ఒక 'బాధాకర, ఆనందకరమైన' రోజుగా అభివర్ణించారు. విలీనం సంస్థకు ప్రయోజనకరమని పేర్కొన్నారు. చైనాలో పెద్ద పెద్ద బ్యాంకులు ఉన్నట్లు మన దేశంలోనూ ఆ తరహా బ్యాంకులు ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి బ్యాంకులతో పోటీ పడే విధంగా మన బ్యాంకులు అవతరించాలన్నారు. అందుకోసం బ్యాంకింగ్ రంగంలో కన్సాలిడేషన్ జరగాలని అభిప్రాయపడ్డారు. బ్యాంకుల కొనుగోళ్ల ద్వారానే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో బీమా రంగాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రొడక్టును కమీషన్ కోసం బ్యాంకులు మిస్ సెల్లింగ్ చేయడాన్ని పరేఖ్ తప్పుబట్టారు.




## ఇస్రో నుంచి హెచ్‌ఏఎల్‌కు
# రాకెట్ల సాంకేతికత

- రెండేళ్లలో రెండు ప్రొటోటైప్ ఎస్ఎస్ఎల్‌వీ తయారీ
- తర్వాత ఏటా 6-10 లాంచ్ వెహికల్స్ నిర్మాణం
- స్కైరూట్, అగ్నికుల్ తర్వాత మూడో కంపెనీ ఇదే

**న్యూఢిల్లీ :** స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ)కు సంబంధించిన సాంకేతికత బదిలీ బిడ్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్) దక్కించుకుంది. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్) ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా ఈ విషయాన్ని ప్రకటించారు. ఎస్ఎస్ఎల్‌వీ: ఇది ఇస్రోకు చెందిన రాకెట్. 500 కిలోల వరకు బరువు ఉండే ఉపగ్రహాల (శాటిలైట్ల)ను భూమి నుంచి తక్కువ ఎత్తు (500 కి.మీ. వరకు)లో ఉండే కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి ఇది పంపగలుగుతుంది. అదానీ, బీడీఎల్ సంస్థలను అధిగమించి: అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ మద్దతు ఉన్న ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్, హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నేతృత్వంలోని రెండు బృందాలను పక్కకునెట్టి మరీ హెచ్ఏఎల్ ఈ బిడ్ గెలుచుకుంది. ఫైటర్ జెట్ తయారీ కంపెనీ అయిన హెచ్ఏఎల్ ఈ బిడ్డింగ్‌లో మరో సంస్థ సహకారం లేకుండా, ఒంటరిగానే పోటీ చేసి రూ.511 కోట్లతో బిడ్ గెలుచుకుంది. ఈ సాంకేతికత బదిలీ ఒప్పందం కింద ఎస్ఎస్ఎల్‌వీని హెచ్ఏఎల్ స్వతంత్రంగా నిర్మించి, వాణిజ్యీకరణ చేసుకోవచ్చని పవన్ కుమార్ గోయెంకా తెలిపారు. 'వచ్చే రెండేళ్లలో 2 ప్రోటోటైప్ రాకెట్ల నిర్మాణానికి హెచ్ఏఎల్‌కు ఇస్రో సహకారం అందిస్తుంది. ఆ తర్వాత గిరాకీని బట్టి ఏటా 6–10 ఎస్ఎస్ఎల్‌వీలను స్వతంత్రంగా హెచ్ఏఎల్ తయారు చేసుకోవచ్చు. రెండేళ్ల అనంతరం అంటే మూడో రాకెట్ నుంచి డిజైన్‌ను మెరుగుపరచుకోవడానికి, సొంత వెండర్లను ఎంపిక చేసుకోవడానికి హెచ్ఏఎల్‌కు స్వతంత్రత ఉంటుంద'ని వివరించారు. 'ఎస్ఎస్ఎల్‌వీ తయారీ బిడ్‌ను దక్కించుకోవడం తమకు గర్వకారణమ'ని హెచ్ఏఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ బి. సేనాపతి పేర్కొన్నారు.

**మూడో కంపెనీ:** అంతరిక్ష రంగంలో అంకురాలైన స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్ తర్వాత రాకెట్ల తయారీలోకి అడుగుపెడుతున్న మూడో కంపెనీ హెచ్ఏఎల్ అవుతుంది. 'ఎస్ఎస్ఎల్‌వీ సాంకేతికత కోసం మొత్తం 9 కంపెనీలు ఆసక్తి ప్రదర్శించాయి. మూడింటిని తిరస్కరించాం. మిగతా ఆరింటిలో మూడు దరఖాస్తు చేయలేద'ని గోయెంకా తెలిపారు.

**13.9 బి. డాలర్లు:** 2023 నాటికి లో ఎర్త్ ఆర్బిట్ లాంచ్ వెహికల్స్‌కు అంతర్జాతీయంగా ఉన్న మార్కెట్

**44 బి. డాలర్లు:** 2032 కల్లా ఈ మార్కెట్ స్థాయిపై అంచనా.

**2%:** అంతర్జాతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా ఇది. 2030 కల్లా ప్రస్తుత 8 బి. డాలర్ల నుంచి 44 బి. డాలర్లకు చేరాలన్నది భారత లక్ష్యంగా ఉంది.

## బజాజ్ ఫ్రీడమ్ 125 సీఎన్‌జీ
## మోటార్ సైకిల్‌పై 5వేలు డిస్కౌంట్



ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్ ఫ్రీడమ్ 125పై బజాజ్ ఆటో డిస్కౌంట్ ప్రకటించింది. ఈ బైక్‌ను విడుదల చేసి ఏడాది పూర్తి కావొస్తున్న వేళ ఎంట్రీ లెవల్ డ్రమ్ వేరియంట్‌పై రూ.5 వేలు డిస్కౌంట్ ప్రకటించింది. దీంతో ఈ బైక్ రూ.85,976కే (ఎక్స్‌షోరూమ్, దిల్లీ) లభించనుంది. మిగిలిన వేరియంట్ల ధరలను మాత్రం యథావిధిగా కొనసాగించింది. ఫ్రీడమ్ 125 సీఎన్‌జీ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఎల్ఈడీ (రూ.95,981), ఎల్ఈడీ (రూ.1.11 లక్షలుగా) మోడళ్లను ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్ విక్రయిస్తోంది. బేస్ వేరియంట్ గ్రే, బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. మిగిలిన రెండు వేరియంట్లు ఐదు రంగుల్లో లభ్యమవుతాయి. ఫ్రీడమ్ 125పై గతేడాది కూడా బజాజ్ ఆటో ఆఫర్లు ప్రకటించింది. బేస్ వేరియంట్‌పై రూ.5వేలు, టాప్ వేరియంట్‌పై రూ.10 వేలు చొప్పున తాత్కాలిక డిస్కౌంట్ ఇచ్చింది.

**ఫ్రీడమ్ ఫీచర్లు ఇవే..**

ఇక ఫీచర్ల విషయానికొస్తే.. 125 సీసీ ఇంజిన్ కలిగిన ఫ్రీడమ్ 125లో 2 కేజీల సీఎన్‌జీ ట్యాంక్, 2 లీటర్ల పెట్రోల్ ట్యాంక్ ఉంటుంది. సీఎన్‌జీ 2 కేజీలకు 200 కిలోమీటర్లు, పెట్రోల్ రెండు లీటర్లకు 130 కిలోమీటర్లు (లీటర్‌కు 65 కి.మీ.) కలిపి 330 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఇంజిన్ 9.5 పీఎస్ పవర్, 9.7 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సీఎన్‌జీపై టాప్‌స్పీడ్ గంటకు 90.5 కిలోమీటర్లు, పెట్రోల్‌పై టాప్ స్పీడ్ 93.4 కిలోమీటర్లు వెళుతుందని కంపెనీ పేర్కొంది. సీఎన్‌జీ, పెట్రోల్ ట్యాంక్‌లను సీటు కింద అమర్చారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక

# నిహారికకు ఇష్టం లేకుండా పెళ్లి చేశాం

## మెగా బ్రదర్ నాగబాబు



మెగా బ్రదర్ నాగబాబు ప్రస్తుతం ఒక పక్క రాజకీయాలతో బిజీగా ఉన్నా కూడా అప్పుడప్పుడు పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా మారాడు. ఇక చాలా రేర్ గా యూట్యూబ్స్ కి ఇంటర్వ్యూలు ఇచ్చే నాగబాబు తాజాగా ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లల గురించి మాట్లాడాడు. నాగబాబుకు కొడుకు వరుణ్ తేజ్, కూతురు నిహారిక ఉన్నారు. ముకుంద సినిమాతో వరుణ్ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. మంచి వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుణ్ తనకంటూ అభిమానులను సంపాదించు కున్నాడు. ఏడాది క్రితం హీరోయిన్ లావణ్య త్రిపాఠిని వివాహం చేసుకున్న వరుణ్ కొన్నేళ్లుగా మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రస్తుతం వరుణ్ ఒక కొరియన్ హర్రర్ కథ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాడు. నిహారిక కొణిదెల.. మెగా కాంపౌండ్ నుంచి ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఏకైక వారసురాలు. ఒక మనసు సినిమాతో ఆమె టాలీవుడ్ కు పరిచయమైంది. అయితే మొదటి సినిమాతోనే విమర్శలు అందుకున్న నిహారికఆ తరువాత పలు సినిమాల్లో నటించినా కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. అయితే ట్రోలింగ్ గురవుతుంది అనుకున్నారో.. లేక విజయం అందుకో దేమో అనుకున్నారో తెలియదు కానీ, మెగా ఫ్యామిలీ నిహారికకు పెళ్లి చేసేసింది. చిరంజీవి ఫ్రెండ్ కొడుకు అయిన జొన్నలగడ్డ చైతన్యతో నిహారిక వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. నిహారిక – చైతన్య కలకాలం కలిసి ఉంటారు అనుకున్న మెగా ఫ్యాన్స్ కు నిరాశ ఎదురయ్యింది. ఆ జంట విభేదాల వలన విడాకులు తీసుకొని విడిపోయారు. దీంతో నిహారిక మరోసారి ట్రోలింగ్ కు గురైంది. కావాలనే నిహారిక అత్తవారింటిని వదిలేసి వచ్చిందని, పబ్ వివాదం ఆ జంటను వేరు చేసిందని రకరకాలుగా వార్తలు పుట్టుకొచ్చాయి. ఇలాంటివేమీ పట్టించుకోని నిహారిక ప్రస్తుతం నిర్మాతగా మారి మొదటి సినిమాతోనే గద్దర్ అవార్డును సొంతం చేసుకుంది.

తాజాగా నాగబాబు తన కూతురు నిహారిక పెళ్లి గురించి మాట్లాడుతూ ..' నిహారిక పెళ్లి విషయంలో మేము పొరపాటు చేసాం. మేము వారిని ప్రోపర్ గా జడ్జ్ చేయలేకపోయాము. వారికి సింక్ అవ్వలేదు. మ్యూచువల్ గా ఇద్దరు విడిపోయారు. ప్రస్తుతం తను ప్రొడక్షన్ హౌస్ స్థాపించి ఇప్పుడిప్పుడే తేరుకుంటుంది. ఏదో ఒకరోజు తను వేరొక అబ్బాయిని కలుస్తుంది. పెళ్లి చేసుకుంటుంది. అంతే. ఈసారి మాత్రమే కాదు నేనెప్పుడూ కూడా పిల్లల విషయాల్లో ఇన్వాల్వ్ అవ్వాలనుకోలేదు.నిహారిక పెళ్లి.. అబ్బాయిని చూపించింది మేమే తప్ప.. ఆమె మద్దతుతో మేము చేయలేదు. మేము చెప్పాము.. ఓకే అన్నట్లు అంతే. ఇష్టంతోనే పెళ్లి చేసుకుంది కానీ, అది తన స్వంత ఇష్టం కాదు. ఇప్పుడు ఒక అబ్బాయి అమ్మాయి కలిసి పెళ్లి చేసుకున్నారు.. వారు జీవితాంతం కలిసి ఉండాలా వద్దా అనేది వాళ్ల జడ్జిమెంట్. వాళ్లు వద్దనుకున్నారు.. విడిపోయారు. నేనెప్పుడూ వారి మధ్య సిమెంట్ వెయ్యడం కానీ, నిప్పు అంటించడం కానీ చేయలేదు. చేయను కూడా. నిహారికకు అడిగాను. ఆమె విడిపోతాను అంది. ఓకే అని చెప్పాను. మర్యాదపూర్వకంగానే విడిపోయారు. ఇప్పుడు తను తన జీవితాన్ని సంతోషంగా గడుపుతుంది' అని చెప్పుకొచ్చాడు.

# ఆయన వల్లే ఇదంతా సాధ్యమైంది

## : 'కుబేర'పై రష్మిక పోస్ట్


హైదరాబాద్:
ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటించారు. సమీరా పాత్రలో ఒదిగిపోయి నటించారామె. సినిమాలో తన పాత్రకు వస్తోన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని రష్మిక తాజాగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. శేఖర్ కమ్ముల వల్లే తాను ఆవిధంగా యాక్ట్ చేయగలిగానని అన్నారు. "శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర'లో సమీరా పాత్రలో నటించా. ఆయన వల్లే సమీరా పాత్రలో ఆవిధంగా ఒదిగిపోగలిగాను. వృత్తిపై ఆయనకున్న ప్రేమ తన సినిమాల్లో ఎప్పుడూ కనిపిస్తుంటుంది. అందుకే ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. 'కుబేర'తో నాకు అవకాశం దొరికినప్పుడు.. ఒక నటిగా ఆయన నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అందుకే ఆయన చెప్పినవిధంగా ప్రతి సన్నివేశంలో యాక్ట్ చేయగలిగాను. ఆయన వల్లే ఈరోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కుతున్నాయి. అద్భుతమైన నటీనటులతో పనిచేసినప్పుడు వారికి సమానంగా యాక్ట్ చేయాల్సిన బాధ్యత ఉంటుంది. ధనుష్ లాంటి గొప్ప నటుడు పక్కన యాక్ట్ చేస్తున్నప్పుడు.. ప్రతి సీన్‌లో శ్రమించాల్సిందే. దేవాతో కలిసి సమీరా పాత్రలో నటించినందుకు ఎంతో సంతోషిస్తున్నా. నాగార్జున సర్ గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. ఆయన నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ది బెస్ట్. ఆయన జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ సినిమాలో భాగమైన టీమ్ అందరికీ, నా అభిమానులకు, సినీ ప్రియులకు ధన్యవాదాలు. సమీరా.. ఒక అందమైన గందరగోళం లాంటిది. సినిమా చూసిన తర్వాత నేను ఎందుకు ఇలా చెబుతున్నానో మీరే అర్థం చేసుకుంటారు" అని ఆమె రాసుకొచ్చారు. ప్రతిఒక్కరూ వీక్షించాల్సిన చిత్రమిదన్నారు.




# డ్రగ్స్‌పై మలయాళ ఇండస్ట్రీ కీలక నిర్ణయం

ఖ మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై చిత్ర నిర్మాణంలో పాలుపంచుకునే ప్రతి ఒక్కరూ, డ్రైవర్ల నుండి సూపర్ స్టార్స్ వరకు, షూటింగ్ సమయంలో మాదకద్రవ్యాలను ఉపయోగించబోమని హామీ ఇస్తూ అఫిడవిట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధన జూన్ 26 నుండి అమలులోకి రాబోతుంది. ఇదే రోజున మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకోబోతున్నారు ఇటీవల చిత్ర పరిశ్రమలో చోటుచేసుకున్న డ్రగ్స్ సంబంధిత అరెస్టులు, పలువురు నటులు, సిబ్బంది సభ్యులు పట్టుబడటంతో ఈ కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ వెల్లడించింది. షూటింగ్ సెట్లు, లొకేషన్లు మరియు పోస్ట్-ప్రొడక్షన్ కార్యకలాపాల్లో డ్రగ్స్ లేని వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని అసోసియేషన్ పేర్కొంది. ఈ నిర్ణయంపై ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ మలయాళ చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలతో విస్తృతంగా చర్చలు జరిపింది. డ్రగ్స్ లేని పరిశ్రమను కోరుకుంటూ అందరూ ఈ చర్యకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్ కూడా ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

# నా బాడీ నా ఇష్టం : శృతిహాసన్



కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వా ర్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమం లోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్య లేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్ట్రబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు. మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చక పోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ నేను అలా కాదు నా నాబాడీ నా ఇష్టమన్నారు శృతిహాసన్.





# 'దృశ్యం3': ఇటు మోహన్‌లాల్.. అటు అజయ్ దేవ్‌గణ్

'దృశ్యం3'.. ప్రస్తుతం సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. ఇప్పటికే మలయాళ దర్శకుడు జీతూ జోసెఫ్ ఇందుకు సంబంధించిన స్క్రిప్ట్‌ను పూర్తి చేశారు. 'గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు.. దృశ్యం3 రాబోతోంది' అని ప్రకటించి మరో సారి ఆసక్తి రేకెత్తించారు. ఈ క్రమంలో బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ చేసిన ప్రకటన సినీ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. తాను కూడా 'దృశ్యం3' చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే, తొలి రెండు భాగాలు మలయాళం మాతృకకు రీమేక్ కాగా, అజయ్ తీయబోయే 'దృశ్యం3' సొంత కథ కావడం గమనార్హం. జీతూ జోసెఫ్ రాసుకున్న 'పార్ట్3' కథకు దీనితో ఎలాంటి సంబంధం లేకపోవడం గమనార్హం.

### మోహన్‌లాల్.. అజయ్ పోటాపోటీ

ప్రస్తుతం అందరిలోనూ ఆసక్తి రేకెత్తించే అంశం.. ఎవరు ముందుగా సినిమాను పట్టాలెక్కిస్తారు? మలయాళ ఇండస్ట్రీలో నడుస్తున్న టాక్ ప్రకారం.. ఓనమ్ పండుగ తర్వాత 'దృశ్యం3' షూటింగ్ షురూ కానుందని ఉదయం నుంచి వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ అక్టోబరు నుంచి ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్తుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. 'లైట్స్.. కెమెరా.. అక్టోబరు' అంటూ వీడియోను విడుదల చేసింది. ఈలోగా నటీనటులు, సాంకేతిక నిపుణులు, లొకేషన్స్ అన్నీ పక్కాగా ప్లాన్ చేసుకుని జీతూ జోసెఫ్ ముందుకు వెళ్లనున్నారు. తొలి రెండు భాగాల్లో కనిపించిన నటీనటులతో పాటు, కొత్తవారు కూడా 'పార్ట్3'లో భాగం కానున్నారు. మరోవైపు అజయ్ దేవ్‌గణ్ కూడా కూడా తన 'దృశ్యం3'ని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది అక్టోబరు 2వ తేదీ నుంచి షూటింగ్ ప్రారంభించే దిశగా పనులు మొదలు పెట్టారట. ఇప్పటికే కథ, కథనాలు పూర్తి కాగా, డైలాగ్ వెర్షన్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అలాగే, కథకు అనువైన లొకేషన్స్ వేటలో చిత్ర బృందం ఉందట. ఈలోగా అజయ్ తాను నటిస్తున్న 'ధమాల్ 4', 'రేంజర్' చిత్రాలను పూర్తి చేయనున్నారు. అనంతరం 'దృశ్యం3' అవుట్ డోర్ షూటింగ్ కోసం మూడు నెలల సమయం కేటాయించాలని అజయ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరికొన్ని కీలక సన్నివేశాలను స్టూడియోలో సెట్స్ వేసి, చిత్రీకరణ జరపనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 అక్టోబరు 2వ తేదీన సినిమాను విడుదల చేయాలని భావిస్తున్నారట.

### మరి ఎవరు ముందు..

ఈ ప్రశ్నకు సమాధానం కాస్త కష్టమే అయినా, ఈ విషయంలో మలయాళ 'దృశ్యం3' కాస్త ముందుగా వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ టాక్. ఎందుకంటే, మోహన్‌లాల్ తన సినిమా విషయంలో చాలా క్లారిటీతో ఉంటారు. ఒకసారి సెట్స్‌పైకి వెళ్తే, శరవేగంతో షూటింగ్ పూర్తి చేస్తారు. పైగా జీతూ జోసెఫ్ టేకింగ్ వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. పరిమిత లొకేషన్స్‌లో అనవసర హంగులు, ఆర్భాటాలు లేకుండా చిత్రీకరణ పూర్తి చేస్తారు. అదంతా వెండితెరపై స్పష్టం గా కనిపించింది. అజ య్ దేవ్‌గణ్ మూవీ విషయానికొస్తే, ఆయన ఏడాది సమ యం పెట్టుకున్నా రు. అన్నీ అనుకున్నట్లు పూర్త యితే, ఇం కాస్త ముందుగా కూడా విడుదల కావచ్చు.

# వరుస సినిమాలతో ప్రియాంక మోహన్ బిజీ



ప్రియాంక మోహన్.. స్టార్ హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అమ్మడు. పేరుకు మలయాళ నటినే అయినా పక్కింటమ్మాయిలా కనిపిస్తూ తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరవవు తోంది. తన అందం, అభినయంతో టాలీవుడ్ లో క్రమంగా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతోంది. కెరీర్ ప్రారంభంలోనే నాని, శర్వానంద్ లాంటి ప్రామిసింగ్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఈ అందాల తార ఇప్పుడు ఏకంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. స్టైలిష్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్నతెరకెక్కిస్తోన్న ఓజీలో ఈ బ్యూటీనే మెయిన్ హీరోయిన్ గా ఎంపికైంది ప్రియాంక మోహన్. చివరిగా సరిపోదా శనివారంతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుంది ప్రియాంక అరుళ్ మోహన్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఆమె రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు గ్లామర్ డోస్ కు దూరంగా ఉ ఒడే ఈ అమ్మడు ఇప్పుడు తన బ్యూటీ ఫుల్ ఫోటోలతో అభిమానులను మెప్పిస్తుంది. 2019లో కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ప్రియాంక మోహన్. అదే సంవత్సరం న్యాచురల్ స్టార్ నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు సినిమాకు పరిచయమైందీ అందాల తార. ఆతర్వాత శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించింది. ఆతర్వాత టాలీవుడ్ లో గ్యాప్ ఇచ్చింది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. చీరకట్టులో అందాలు ఒలకబోస్తూ క్రేజీ ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అమ్మడి అందాలను పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.



# పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి మొదటి సినిమా

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కొన్ని రోజులు సినిమాలకు బ్రేక్‌నిచ్చిన విషయం తెలిసిందే. 2023లో వరుణ్ తేజ్‌తో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన లావణ్య సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లి తర్వాత మెగా కోడలిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపింది. లావణ్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం సతీ లీలావతి(). భీమిలీ కబడ్డీ జట్టు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో లావణ్య కోపంతో అరుస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే మూవీ భార్య భర్తలమధ్య ఉన్న అనుబంధం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. మరోవైపు లావణ్య– వరుణ్ దంపతులు త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com